

# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


## దుర్గగుడిలో నేడు భక్తులకు ఉచిత దర్శనం

### పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు దంపతులు



ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగాజరుగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత పవిత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా శు క్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య కనకదుర్గమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

4

## వికసిత్ భారత్‌లో మహిళా భాగస్వామ్యం కీలకం



- స్వయం సమృద్ధితో ఇతరులకు ఆసరాగా నిలుస్తున్నారు
- గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో వారికి కేంద్రం ప్రాధాన్యం
- గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వం అందిస్తోంది
- లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా దిశానిర్దేశం చేస్తోంది
- ఆర్థికంగా ఎదిగి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
- విజయవాడ రావడం ఎంతో ఆనందం కలిగించింది
- జాతీయ సరస్ మేళా ప్రారంభంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్

దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన జాతీయ సరస్ మేళాను గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళా నిర్వహణ ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యసాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతో పాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

3

## మహిళా శక్తికి వేదిక సరస్ మేళా

- వారి ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- ప్రపంచ మార్కెట్ల వరకు చేరేలా సరఫరా
- ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు
- సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- కార్యక్రమానికి వచ్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు
- ఆమె జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకం
- సరస్ మేళా ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

2

గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిదడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించ డంపై కృతజ్ఞతలు తెలిపారు. సరస్ మేళా కేవలం 14 రోజుల పాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.







## లలితా త్రిపుర సుందరిగా దుర్గమ్మ



విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తున్నారు.

## నేడు విజయవాడ ఉత్సవ్‌కు చైనా రాయబారి



3

## నేడు ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనం ప్రారంభం

విజయవాడలో శుక్రవారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవనాన్ని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.

6




## కూటమి సీట్ల సర్దుబాటు ఖరారు

- పట్టణ స్థానిక ఎన్నికల్లో పోటీపై ఉమ్మడి నిర్ణయం
- 17 కార్పొరేషన్లలో టీడీపీ 11, జనసేన 4, బీజేపీ 2
- 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టీడీపీ 78, జనసేన 21, బీజేపీ 7 స్థానాలు




10

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నిర్ణయానికి వచ్చాయి. ఈ మేరకు జాబితాను విడుదల చేశారు. 17 మున్సిపల్ కార్పొరేషన్లలో టీడీపీ 11 స్థానాల్లో, జనసేన 4, బీజేపీ 2 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. 106 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టీడీపీ 78స్థానాలు, జనసేన 21 స్థానాలు, బీజేపీ 7 స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

## నేటి నుంచే మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

అమరావతి(చైతన్యరథం): ఏపీలో స్థానిక సంస్థలకు సంబంధిం చి శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలుకానుంది. ఇందుకు సంబంధించి మున్సిపాలిటీలలో అన్ని ఏర్పాట్లు పూర్త య్యాయి. తొలి దశలో 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు ఎన్నికలునిర్వహించనున్నారు. ఇందుకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుండగా 18వ తేదీవరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 19 పరిశీలన, 21న ఉపసంహరణకు గడువు ఉంది. అక్టోబరు 28న పోలింగ్, 30న ఫలితాలు వెలువడనున్నాయి. కాగా ఎన్నికల పరిశీలకులుగా 28 మంది ఐఏఎస్‌లను నియమిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది.

## తిరుమలలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం రాత్రి మలయప్పస్వామి వారు రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడి అలంకారంలో సర్వభూపాల వాహ నంపై భక్తులకు దర్శనమిచ్చారు.



# మహిళా శక్తికి వేదిక సరస్ మేళా

- వారి ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్
- ప్రపంచ మార్కెట్ల వరకు చేరేలా సరఫరా
- ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు
- సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- కార్యక్రమానికి వచ్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు
- ఆమె జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకం
- సరస్ మేళా ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



విజయవాడ(చైతన్యరథం): గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్ద డమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసా రిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయ వాడకు మరింత శోభ తెచ్చిందని పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించి ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్న త రాజ్యాంగ పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహిం చగలరని నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఇది కేవలం 14 రోజుల పాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిం చడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు రావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.





## రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నా రు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్ర మం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశా రని గుర్తుచేశారు. నిన్నటివరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్‌హెచ్‌జీలు నేడు వ్యాపార సంస్థలుగా ఎదుగుతున్నాయని..భవిష్య త్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పిం చే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ-కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదిక ల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని తెలిపారు.



## ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి

సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువు కు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చుల ను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజ నాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామిక వేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ఆకాంక్షిం చారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్య మిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేం దుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత తదితరులు హాజరయ్యారు.







# వికసిత్ భారత్‌లో మహిళా భాగస్వామ్యం కీలకం

- స్వయం సమృద్ధితో ఇతరులకు ఆసరాగా నిలుస్తున్నారు
- గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో వారికి కేంద్రం ప్రాధాన్యం
- గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వం అందిస్తోంది
- లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా దిశానిర్దేశం చేస్తోంది
- ఆర్థికంగా ఎదిగి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి
- విజయవాడ రావడం ఎంతో ఆనందం కలిగించింది
- సరస్ మేళా ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

విజయవాడ(చైతన్యరథం): దుర్గాదేవి ఉత్సవాల నేపథ్యంలో పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో భాగంగా 'లఖ్‌పతి దీదీ' మేళాను నిర్వహించడం ఒక విశేషమైన కలయికగా భావిస్తున్నట్లు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు.



పున్నమిఘాట్ లో జాతీయ సరస్ మేళాను గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రాష్ట్రపతి మాట్లాడుతూ విజయవాడకు రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. కనకదుర్గ అమ్మవారిని దర్శించుకునే అవకాశం లభించిందన్నారు. గ్రామీణాభివృద్ధి అంటే గ్రామాల వికాసమని చెప్పుకొచ్చారు. మహి ళల స్టాళ్లను సందర్శించే అవకాశం దక్కిందని.. వారి ఉత్సాహం చూస్తుంటే మహిళలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని స్పష్టమవుతోం దన్నారు. ఒకప్పుడు మహిళలు వెనుకబడి ఉండేవారని.. కేవలం కుటుంబ సంరక్షణకే పరిమితమై ఆర్థికంగా చిన్న చిన్న అవసరాల కోసం కూడా ఇతరులపై ఆధారపడే పరిస్థితి ఉండేదని చెప్పు కొచ్చారు. కానీ నేడు మహిళలు సంపూర్ణంగా స్వయం సమృద్ధి సాధించారని తెలిపారు. అంతేకాకుండా ఇతరులకు కూడా ఆసరాగా నిలుస్తున్నారని తెలిపారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యసాధనలో మహిళల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆలోచన, మహిళల సంకల్పం దేశంలోని ముఖ్యమంత్రులందరి ఉమ్మడి కృషి ఫలితంగా మహిళా సాధికారత సాగుతోందని తెలిపారు. 2047 కంటే ముందే భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంద నడంలో ఎటువంటి సందేహం లేదని ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమైనదని వెల్లడి చారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గ్రామీణ మహిళలకు ఆర్థిక, సాంకేతిక సామాజిక సాధికరత దిశగా కొత్త మార్గం లభించిందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు కుటుంబంలో ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకోవడంలోనూ మహిళల భాగస్వామ్యం పెరిగిందని పేర్కొన్నారు. భారతదేశం భిన్న భాషలు, విభిన్న సంస్కృతులు, వేర్వేరు సంప్రదాయాలు కలిగిన దేశమైనప్పటికీ అంతా ఒక్కటే అని తెలిపారు.

**మహిళలకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం**

ప్రస్తుత గ్రామీణ ప్రాంతాల్లో 50 శాతం మంది మహిళలు రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారు. ఒకప్పుడు బ్యాంకుల వద్దకు వెళ్లడానికి సంకోచించిన మహిళలు నేడు ఎవరి సాయం లేకుండా స్వయంగా బ్యాంకులకు వెళ్లి తమ పనులను స్వతంత్రంగా చక్కబెట్టుకుంటున్నారని తెలిపారు. అంత్యోదయ సమగ్ర దృక్పథానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తన గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో మహిళలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మహిళలే గ్రామాల రూపురేఖలను మార్చే నాయకత్వాన్ని అందిస్తున్నారని చెప్పారు. భారత ప్రభుత్వం లఖ్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు ఒక ప్రత్యేకమైన వేగం, దిశానిర్దేశం అందించిందని వివరించారు.

**నైపుణ్యాభివృద్ధిలో కొత్త అవకాశాలు**

డిజిటల్ సేవలు, పునరుత్పాదక ఇంధనం వంటి ఆధునిక రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరుగుతూ వారికి నైపుణ్యాభి వృద్ధిలో కొత్త అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. గవర్నర్‌గా ఉన్న సమయంలో అక్కడి గ్రామీణ ప్రజలకు సేవచేసే అవకాశం లభించిందన్నారు.

మహిళలు ల్యాప్‌టాప్‌లను ఉపయోగిస్తూ ఎంత పెట్టుబడి పెడుతున్నారు, ఎంత లాభం పొందుతున్నారు, భవిష్యత్ ప్రణాళికలు ఏమిటి అనే వివరాలను స్వయంగా ల్యాప్‌టాప్‌లో నమోదు చేసుకుంటూ పనులు చేసుకునే వారని తెలిపారు. ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, కుటుంబంతోపాటు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

---

# మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం

*వారి ఉత్పత్తులకు అంతర్జాతీయ బ్రాండ్*

*'స్వయం ఏపీ'పై సీఎం చంద్రబాబు ట్వీట్*

అమరావతి(చైతన్యరథం): డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతోపాటు వారిని విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధి వెలుపల తొలిసారిగా జాతీయ సరస్ మేళాను నిర్వహిస్తున్న కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిర్ణయం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తోందని తెలిపారు.

ఈ మేళా ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 650కి పైగా స్వయం సహాయక సంఘాలు ఏపీకి తరలి వచ్చాయని వెల్ల డించారు. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళా సంఘాలు తమ ఉత్పత్తులను ప్రదర్శించడంతో పాటు వాటికి విస్తృత మార్కెట్ అవకాశాలు కల్పించుకునేందుకు ఈమేళా వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు తయారుచేసే ఉత్పత్తులకు స్థానిక మార్కెట్లకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా.. అంతర్జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వయం ఏపీ' కార్యక్రమం ద్వారా ఈ-కామర్స్, గ్లోబల్ మార్కెట్లు తో అనుసంధానం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెట్ సదుపాయాలు అందుబాటులోకి వస్తే



వారు ఆర్థికంగా మరింత ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామం ఒక ఎంటర్‌ప్రైజ్ కేంద్రంగా, ప్రతి మహిళ సంపద సృష్టికర్తగా మారాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టంచేశారు. ఈ లక్ష్యసాధనతోనే స్వర్ణాంధ్రప్రదేశ్ దిశగా అడుగులు వేస్తూ వికసిత్ భారత్ నిర్మాణానికి రాష్ట్రం తన వంతు సహకారం అందిస్తోందని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

## ఏపీ ఇంటర్ పరీక్షల్లో కీలక మార్పులు

**2027 నుంచి అమల్లోకి నూతన విధానం**

అమరావతి(చైతన్యరథం): ఇంటర్ పరీక్షా విధానంలో మార్పులు చేస్తూ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. నూతన విధానాలు 2027 మార్చిలో జరగబోయే ఇంటర్ పరీక్షల నుంచి అమల్లోకి రానున్నట్లు బోర్డు వెల్లడించింది. ఈ మేరకు ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ మార్పు లపై అవగాహన కల్పించాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఏపీ ఇంటర్‌బోర్డు సెక్రటరీ పి.రంజిత్ బాషా ఆదేశాలు జారీచేశారు. ఒకేషనల్ కోర్సులకు యథాతథంగా పాత పద్ధతిలోనే 24 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌ను ఉంచగా.. జనరల్ థియరీ సబ్జెక్టులన్నింటికీ ఆన్సర్ బుక్‌లెట్‌లో పేజీల సంఖ్యను 32కు పెంచుతూ బోర్డు నిర్ణయం తీసుకుంది. ఫస్ట్, సెకండియర్ బయాలజీ పరీక్షకు ఒకే ఓఎమ్ఆర్ షీట్, 40 పేజీల ఆన్సర్ బుక్‌లెట్ పంపిణీ చేయనున్నట్లు వెల్లడించింది. బోటనీ, జువాలజీలకు ఇకపై వేర్వేరు ఓఎమ్ఆర్ షీట్లు ఉండవని స్పష్టం చేసింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, సివిక్స్, ఎకనామిక్స్, కామర్స్, హిస్టరీ లాంటి ఎలక్టివ్ సబ్జెక్టులకు మాత్రమే వేర్వేరు ప్రశ్నపత్రాలు ఉంటాయని బోర్డు వెల్లడించింది.

## విజయవాడ ఉత్సవ్‌కు చైనా రాయబారి

**సీఎం చంద్రబాబు ఆహ్వానానికి అంగీకారం**

అమరావతి(చైతన్యరథం): సీఎం చంద్రబాబు సమర్థవంతమైన పాలన, దౌత్యపరమైన అనుభవం వల్ల రాష్ట్రానికి మరో అరుదైన గౌరవం దక్కింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి, చారిత్రక నగరమైన విజయవాడ కీర్తి ప్రతిష్ఠలు మరింత ఇనుమడించేలా అక్టోబరు 16న శుక్రవారం నుంచి 18 వరకు విజయవాడ ఉత్సవ్ 2.0' వేడుకలకు భారత్‌లోని చైనా రాయబారి హెచ్.ఇ.శ్రీ జు ఫేఇహాంగ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. ఈ వేడుకలకు రావాల్సిందిగా సీఎం చంద్రబాబు చేసిన ఆహ్వానాన్ని చైనా రాయబారి సంతోషంగా అంగీకరించారు. ఈ మేరకు అక్టోబర్ 13, 2026 నాడే ఆయన అధికారికంగా లేఖ ద్వారా అంగీకారాన్ని తెలిపారు. తన సతీమణి టన్ యుక్సియుతో కలిసి విజయవాడకు వస్తున్నట్లు ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఇది నిదర్శనం. భారతదేశం, చైనాలు అత్యంత



ప్రాచీన నాగరికతలు కలిగి ఉన్నాయని, రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, ప్రజల మధ్య పరస్పర మార్పిడి ఎంతో ముఖ్యమని చైనా రాయబారి తన లేఖలో ప్రశంసించారు. ఏపీలో సీఎం చంద్రబాబును కలిసి, ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంపొందించే మార్గాలపై చర్చిస్తానని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పరిణామం రాష్ట్ర పర్యాటక రంగానికి, అంతర్జాతీయ సంబంధాల కు ఎంతో ఊపునిస్తుందని చెప్పవచ్చు. అక్టోబరు 16 నుంచి మూడురోజుల పాటు జరగనున్న ఈ వేడుకలు విజయవాడ చరిత్రలోనే మైలురాయిగా నిలవనున్నాయి. రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలను, గొప్ప వైవిధ్యాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకు వెళ్లేందుకు చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాలకు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు లభిస్తు న్నాయి. ఒక అంతర్జాతీయ స్థాయి దౌత్యవేత్త రాష్ట్ర వేడుకలకు వస్తుండటం కూటమి ప్రభుత్వ దౌత్య విజయానికి, ఏపీ బ్రాండ్ ఇమేజ్‌కు గర్వకారణం.

### స్థానిక ఎన్నికలకు పరిశీలకులుగా

## ఐఏఎస్‌ల నియామకం



అమరావతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు 28 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) నియమించింది. ఆ పరిశీలకుల జాబితాను ఎస్ఈసీ గురువారం విడుదల చేసింది.

| | |
|---|---|
| పల్నాడు జిల్లా | : కె.కన్నబాబు |
| కృష్ణా జిల్లా | : ముదవత్ ఎం.నాయక్ |
| మార్కాపురం జిల్లా | : సి.హెచ్.శ్రీధర్ |
| పశ్చిమగోదావరి జిల్లా | : ఎం.వి.శేషగిరిబాబు |
| బాపట్ల జిల్లా | : కె.వి.ఎన్.చక్రధర్‌బాబు |
| ప్రకాశం జిల్లా | : హెప్సీబారాణి |
| ఏలూరు జిల్లా | : మనజీర్ జిలానీ సమూన్ |
| ఎన్టీఆర్ జిల్లా | : ఎస్.నాగలక్ష్మి |
| వైఎస్ఆర్ కడప జిల్లా | : పి.రంజిత్ బాషా |
| చిత్తూరు జిల్లా | : శివశంకర్ లోతేటి |
| అంబేద్కర్ కోనసీమ జిల్లా | : పి.ప్రశాంతి |
| గుంటూరు జిల్లా | : షాంగిలి షాన్‌మోహన్ |
| తూర్పు గోదావరి జిల్లా | : ఎం.గౌతమి |
| శ్రీ సత్యసాయి జిల్లా | : పి.అరుణ్‌బాబు |
| అనంతపురం జిల్లా | : కె.శ్రీనివాసులు |
| కాకినాడ జిల్లా | : బి.లావణ్యవేణి |
| నెల్లూరు జిల్లా | : ఎస్.భార్గవి |
| నంద్యాల జిల్లా | : జె.వెంకటమురళి |
| పోలవరం జిల్లా | : చేతన్ టి.ఎస్ |
| అల్లూరి సీతారామరాజు జిల్లా | : రోణంకి కూర్మనాథ్ |
| అనకాపల్లి జిల్లా | : గోపాలకృష్ణ రోణంకి |
| అన్నమయ్య జిల్లా | : ప్రవీణ్ ఆదిత్య సి.వి |
| విజయనగరం జిల్లా | : ఎన్.తేజ్ భరత్ |
| కర్నూలు జిల్లా | : బి.శ్రీనివాసరావు |
| పార్వతీపురం మన్యం జిల్లా | : ఎస్.చిన్నరాముడు |
| శ్రీకాకుళం జిల్లా | : మల్లవరపు సూర్యతేజ |
| తిరుపతి జిల్లా | : మామిడిపల్లి వరప్రసాద్ |
| విశాఖపట్నం జనరల్ | : గీతాంజలి శర్మ |
| రిజర్వ్ జాబితా | : జి.వీరపాండియన్, షోబిక ఎస్.ఎస్ |

చైతన్యరథం

## మూలా నక్షత్రం దుర్గగుడిలో

# నేడు భక్తులకు ఉచిత దర్శనం

### పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు దంపతులు

విజయవాడ(చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత పవిత్ర మైన మూలా నక్షత్రం సందర్భంగా శుక్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య కనకదుర్గమ్మకు ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. మరోవైపు మూలా నక్షత్రం సందర్భంగా అన్ని క్యూలైన్లలో ఉచిత దర్శనాలు కల్పించనున్నారు. సామాన్య భక్తులకు సులభంగా, వేగంగా ఉచిత దర్శనం కల్పించాలని ఆలయ అధికారులు నిర్ణ యించారు. సాధారణ భక్తుల రద్దీ దృష్ట్యా అంత రాలయ దర్శనాలు, వీఐపీ ప్రోటోకాల్, సిఫార్సు దర్శనాలు పూర్తిగా రద్దు చేశారు. శక్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య అమ్మవారికి సీఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. భక్తులందరికీ ముఖ మండపం నుంచే సరస్వతీ దేవి అలంకార దర్శనం కల్పించనున్నారు. అలాగే కొండపై ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్త కుండా ఎటువంటి ప్రైవేటు వాహనాలను



అనుమతించకూడదని ఆలయ అధికారులు నిర్ణయించారు. సర్వీస్ పాసులతో సహా ఇప్పటికే జారీ చేసిన అన్ని రకాల వాహన పాసులను తాత్కాలికంగా హోల్డ్‌లో ఉంచనున్నారు. అత్య వసర అధికారిక రవాణాకు మాత్రమే అనుమతి ఇవ్వాలని ఆలయ అధికారులు నిర్ణయించారు.

# మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

- మార్కెట్లలో పోటీ పడేలా అవకాశాలు పెంచాలి
- జాతీయ సరస్ మేళాలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ(చైతన్యరథం): మహిళల అభ్యు న్నతిపై దృష్టి కేంద్రీకరించాలని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. పున్నమిఘాట్‌లో గురువారం జాతీయ సరస్ మేళాలో గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి కల్పనను దాటి లాభదాయ కమైన, స్థిరమైన, విస్తరించద గిన మహిళా పారిశ్రామిక సంస్థలను నిర్మించ డంపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. మహిళా పారిశ్రా మికవేత్తలకు తగిన ఆర్థిక వసతులు, ఆధునిక సాంకేతికత, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, బ్రాండింగ్, ప్యాకేజింగ్, నాణ్యతా ప్రమా ణాలు



పెంచుకోవాలని సూచించారు. నమ్మకమైన మార్కెట్ అను సంధానాలు కల్పించడం ద్వారా వారి వ్యాపారాలను విస్తరించుకో వడానికి, విస్తృత మార్కెట్లలో పోటీ పడేలా ప్రోత్సాహం ఇవ్వాలని కోరారు. ఈ సరస్ మేళా కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఎంతోమందికి మంచి అవకాశాలు కలిగిస్తుందని తెలిపారు. కేవ లం సందర్శకుల సంఖ్య ఆధారంగానే కాకుండా వ్యాపార అవకాశాలు, మార్కెట్ సంబంధాలు, వృద్ధి సామర్థ్యం, స్థిరమైన ఉపాధి అవకాశాల ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని సూచించారు. 'సరస్ ఆజీవిక మేళా' వంటి కార్యక్రమాలు గ్రామీణ ఉత్పత్తిదారులకు, పట్టణ వినియోగదారులకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చగలవన్నారు. మహిళల్లో పెట్టుబడి పెట్టడం అంటే బలమైన కుటుంబాలు, సమ్మిళిత సమాజాలు మరింత సుసంపన్నమైన దేశంలో పెట్టుబడి పెట్టడమే అని చెప్పుకొచ్చా రు. మహిళా సాధికారత అంటే మహిళలను బలవంతులుగా మార్చడం కాదన్నారు. మహిళలు ఇప్పటికే బలంగా ఉన్నారని... ప్రపంచం ఆ బలాన్ని చూసే విధానాన్ని మార్చడమే సాధికారత అనేది గుర్తించాలని పేర్కొన్నారు.

## అబ్దుల్ కలాం ఒక స్ఫూర్తి శిఖరం

### సీఎం చంద్రబాబు, లోకేష్ ఘననివాళి



అమరావతి(చైతన్యరథం): మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దు ల్ కలాం జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఘననివాళులర్పించారు. అబ్దుల్ కలాం అంటే ఒక స్ఫూర్తి శిఖరం. అరుదైన వ్యక్తిత్వం ఆయన సొంతం. దేశ అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త మార్గనిర్దేశనం చేసిన దార్శనికుడు అని కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఆ మానవతావాది దేశ, సమాజ సేవలను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.

### కలాం జీవితం నేటి తరానికి ఆదర్శం: లోకేష్



అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేష్ ఘన నివాళులర్పించారు. రాష్ట్రపతిగా దేశానికి విశేష సేవలం దించారని ప్రశంసించారు. తన ప్రసంగాలతో అందరిలో స్ఫూర్తి నింపిన కలాం జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు. భారతరత్న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా దేశానికి వారందించిన సేవలను స్మరించుకుందామని వెల్లడించారు.



## రాష్ట్రపతి ముర్ముతో లోకేష్ భేటీ

విజయవాడ(చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్యఅతిథిగా పాల్గొ నేందుకు విజయవాడ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో గురువారం మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఉదయం విజయవాడ నోవాటెల్ హోటల్‌కు వెళ్లిన లోకేష్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. శాలువాతో ఘనంగా సత్కరించి మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించారు.










# విజయవాడలో జాతీయ సరస్ మేళా

## ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము - పాల్గొన్న సీఎం చంద్రబాబు, గవర్నర్






విజయవాడలో లాఖ్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ వెలుపల తొలి జాతీయ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. ముందుగా సరస్ మేళా ప్రాంగణం వద్ద రాష్ట్రపతికి గవర్నర్, సీఎం, కేంద్రమంత్రులు స్వాగతం పలికారు. అనంతరం సరస్ మేళా ప్రాంగణంలో స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఉత్పత్తులు, చేనేత వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ రాష్ట్రాలకు చెందిన డ్వాక్రా మహిళలతో రాష్ట్రపతి, సీఎం గ్రూప్ ఫొటో దిగారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి, సీఎం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండపల్లి శ్రీని వాస్, వంగలపూడి అనిత, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

























# విజయవాడలో నేటి నుంచి ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్-బ్లడ్ సెంటర్ సేవలు

**- ప్రారంభించనున్న ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి**

అమరావతి (చైతన్యరథం): సమాజ సేవ, ఆరోగ్య రంగంలో నమ్మకమైన సేవలను అందిస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మరో మైలురాయిని అధిగమిస్తోంది. విజయవాడలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ భవన్, బ్లడ్ సెంటర్ ప్రారంభోత్సవం శుక్రవారం జరగనుంది. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి భవనాన్ని, బ్లడ్ సెంటర్ సేవలను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి.

విజయవాడలోని పటమట సాయిబాబా గుడి వీధి బీపీ నగర్‌లో నూతన భవన ప్రారంభోత్సవం శుక్రవారం ఉదయం 9.10-10 గంటల మధ్య జరగనుంది. అనంతరం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ థీమ్ సాంగ్ ప్రదర్శన ఉంటుంది. తరువాత ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ సీఈఓ, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె. రాజేంద్ర కుమార్ స్వాగతోపన్యాసం, నారా భువనేశ్వరి ముఖ్యోపన్యాసం ఉంటాయి.







## నాడు అడుగడుగునా వేధింపులు..
## మత పెద్దలకు నేడు సముచిత గౌరవం

**- ఇమామ్, మౌజమ్ లకు ఆర్థిక భరోసా ఇచ్చింది కూటమి ప్రభుత్వమే**

**- మైనార్టీల సంక్షేమం చేతల్లో చూపిన సీఎం చంద్రబాబు**

**- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్**



అమరావతి (చైతన్యరథం): మత విశ్వాసాలకు పెద్దపీట వేస్తూ అన్ని మతాలను సమాన దృష్టితో చూసిన ఏకైక సీఎం నారా చంద్రబాబు నాయుడు ఒక్కరే అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్ కొనియాడారు. జగన్ రెడ్డి హయంలో మతపెద్దలకు వేధింపులు నిత్యకృత్యమైతే నేడు వారికి అన్ని విధాలుగా అడంగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. అరకొర నిధులతో నాడు మసీదుల్లో పనిచేసే ఇమామ్, మౌజన్లకు జగన్ రెడ్డి మొండి చేయి చూపితే నేడు సకాలంలో నిధులు విడుదల చేస్తున్నామన్నారు. తాజాగా ఇమామ్, మౌజమ్ లకు గౌరవ వేతనం కింద రూ. 22.50 కోట్లు విడుదల చేసి ఆర్థిక చేయూత కల్పించమన్నారు. గత 27 నెలలకు కలిపి ఇప్పటివరకు రూ. 202 కోట్ల గౌరవ వేతనాన్ని విడుదల చేశామన్నారు.

గత వైసీపీ పాలనలో మైనార్టీలంటే చిన్నచూపు ఉండేది. ముస్లింలపై దాడులు నిత్యకృత్యంగా మారేవి. వైసీపీ ఐదేళ్ల కాలంలోనే అబ్దుల్ సలాం, మిస్బా ఫాతిమా ఇలా అనేక మంది హత్యకు గురైయ్యారు. ముస్లిం సామాజిక వర్గానికి వర్తించే పది పథకాలు వరకు రద్దు చేశారు. 30వేల ఎకరాల వక్ఫ్ ఆస్తులను వైసీపీ నాయకులు కబ్జా చేశారు. ఇలా అనేక అరాచకాలను దాటుకుని కూటమి ప్రభుత్వం 2024లో అధికారం చేపట్టింది. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం మత విశ్వాసాలను కాపాడుతూ బడ్జెట్ లో రెండేళ్లలో రూ. 16,147.23 కోట్లు కేటాయింపులు చేసి రూ. 10వేల కోట్లు ఖర్చు చేశాం. హజ్ యాత్ర చేస్తున్న ప్రతి ముస్లింకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నాం. వక్ఫ్ బోర్డు ఆస్తుల్ని వైసీపీ ప్రభుత్వం వివాదాల్లోకి నెట్టితే వాటిని ముస్లిం సంక్షేమానికే ఉపయోగిస్తున్నాం. రాజధాని అమరావతిలో ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ తో పాటుగా హజ్ హౌస్ నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉర్దూ అకాడమీకి రూ. 10 కోట్లు మంజూరు చేశాం. అంతే కాకుండా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్స్, దీపం, స్త్రీ శక్తి వంటి పథకాలతో వెనుకబడిన మైనార్టీ ప్రజల జీవితంలో వెలుగులు తీసుకొస్తున్నామని గురువారం ఒక ప్రకటనలె ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు.

## అన్నమయ్య జిల్లాలో...
## స్థానిక ఎన్నికలపై కూటమి నేతల కసరత్తు

- **మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో ఎన్నికల వ్యూహంపై చర్చ**
- **పాల్గొన్న జోనల్ ఇన్‌చార్జ్ దామచర్ల సత్య, ఆరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్చార్జులు, ముఖ్య నాయకులు**



మదనపల్లె (చైతన్యరథం): అన్నమయ్య జిల్లాలో జరగనున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు ఎన్నికల కార్యాచరణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్ర మదనపల్లె సమీపంలోని హార్సిలీ హిల్స్‌లో జిల్లాకు చెందిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ దామచర్ల సత్య సమక్షంలో గురువారం కీలక సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశంలో ఆరు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొని జిల్లాలోని నియోజకవర్గాల వారీగా ఎన్నికల పరిస్థితులు, రిజర్వేషన్ల అంశాలు, అనుసరించాల్సిన ఎన్నికల వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే చర్యలపై విస్తృతంగా చర్చించారు.

రాబోయే ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కూటమి నాయకులు సమన్వయంతో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని నాయకులకు మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ దామచర్ల సత్య దిశానిర్దేశం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా నాయకుల మధ్య సమన్వయం, కార్యకర్తల భాగస్వామ్యం, పటిష్టమైన ఎన్నికల ప్రణాళికతో ముందుకు సాగుతూ అన్నమయ్య జిల్లాలో కూటమి విజయానికి కృషి చేయాలని ఈ సమావేశంలో దిశానిర్దేశం చేశారు.

# నలుదిశలా బిగుస్తున్న ఉచ్చు..జగన్ విలవిల

- సీబీఐ, ఈడీ కేసుల్లో రోజువారీ విచారణకు కోర్టుల నిర్ణయం
- మద్యం కుంభకోణం, వివేకా హత్యలో 40 కోట్ల సుపారీ.. వేళ్లన్నీ ఆయన వైపే
- తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.43 వేల కోట్ల ప్రజాధనం దోపిడీపై 11 సీబీఐ, 9 ఈడీ ఛార్జ్ షీట్లపై ఇక వేగంగా విచారణ
- న్యాయస్థానాలతో 14 ఏళ్ల ఆటలకు తెర, ఇక జగన్ దారెటు?
- అదే సమయంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్, అగమ్యగోచరంగా వైకాపా పరిస్థితి
- స్థానిక ఎన్నికలపై గతం మరిచి మాట్లాడుతున్న సజ్జల
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య

అమరావతి (చైతన్యరథం): వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రస్తుత రాజకీయ పరిస్థితి చూస్తుంటే కుడితిలో పడ్డ ఎలుకలా కొట్టుమిట్టాడుతున్నట్లుగా ఉందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చుట్టూ ముసురుకుంటున్న అవినీతి కేసులు, హత్యా రాజకీయాలకు సంబంధించిన ఆరోపణల నేపథ్యంలో జగన్ రాజకీయ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కోర్టుల్లో కేసుల విచారణను రోజువారీ ప్రాతిపదికన చేపట్టేందుకు రంగం సిద్ధమైన ఈ తరుణంలో జగన్ రెడ్డి పరిస్థితి ఏంటో, ఆయన దారి ఎటో ఇప్పుడు యావత్ రాష్ట్ర ప్రజలకూ స్పష్టంగా అర్థమైపోయిందన్నారు. తప్పు చేసినవాడు ఎప్పటికీ చట్టం నుంచి తప్పించుకోలేడని స్పష్టం చేశారు.

**పండుతున్న పాపాలు**

తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.43,000 కోట్ల ప్రజాధనాన్ని, ప్రభుత్వ సొమ్మును జగన్ కొల్లగొట్టారని ఈ దేశంలోనే అత్యున్నత దర్యాప్తు సంస్థ అయిన సీబీఐ ఆధారాలతో సహా చెప్పింది. రూ.43,000 కోట్ల అవినీతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, జగన్‌ను అరెస్టు చేసి, 16 నెలల పాటు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంచింది. జగన్‌పై సీబీఐ ఏకంగా 11 చార్జిషీట్లు దాఖలు చేసింది, ఆ అవినీతి దర్యాప్తు ఆధారంగా మనీలాండరింగ్ జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరో 9 చార్జిషీట్లు వేసి, దాదాపు రూ.2,000 నుంచి రూ.3,000 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన సంగతి నిజం కాదా? ఇంతకాలం రకరకాల వాయిదాలు కోరుతూ కాలయాపన చేసిన రోజులు ముగిశాయి. ఇప్పుడు న్యాయస్థానాలు ఈ కేసులన్నింటినీ రోజువారీ పద్ధతిలో విచారించడానికి సిద్ధపడుతున్నాయి. స్పష్టమైన ఆధారాలతో ఇన్ని చార్జిషీట్లు మెడకు చుట్టుకున్న వేళ ఇప్పుడు జగన్ పరిస్థితి ఏమిటి?



చట్టానికి ఎవరూ అతీతులు కారని, చేసిన పాపాలు పండినప్పుడు అనుభవించక తప్పదని జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా గుర్తించాలని వర్ల రామయ్య అన్నారు.

**బిగుస్తున్న ఉచ్చు..జగన్ దారెటు?**

జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. అక్రమాలు, దందాలు ఒక్కొక్కటిగా బట్టబయలవుతుంటే ఆయన పరిస్థితి ఇప్పుడు నిలువునా నీరైపోతోంది. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన రూ.3,500 కోట్ల భారీ మద్యం కుంభకోణంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఇప్పటికే జగన్ కోటరీలోని ముఖ్య నేతలందరినీ సిట్ అధికారులు కటకటాల వెనక్కి నెట్టారు. జగన్ తప్ప మిగిలిన వారంతా ఊచలు లెక్కపెడుతున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ స్థాయి సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ కూడా వాంగ్మూలం, సాక్ష్యాధారాలు ఇచ్చేశారు. ఈ మద్యం దందాలో ఆ రూ.3,500 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయి? ఆ 'అంతిమ లబ్ధిదారుడు' ఎవరు అనేది తేలడమే తరువాయి. ఇక జగన్మోహన్ రెడ్డి సొంత బాబాయ్ వై.ఎస్. వివేకానంద రెడ్డి దారుణ హత్య కేసు హంతకులకు రూ.40 కోట్ల సుపారీ ఇచ్చారనే ఆరోపణల్లో అన్ని వేళ్లూ ఎటువైపు చూపిస్తున్నాయో రాష్ట్రంలో పసిపిల్లాడిని అడిగినా చెబుతారు. ఈ విషయంలోనే కడప ఎంపీ అవినాష్ రెడ్డిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధ, గురువారాల్లో సుదీర్ఘంగా విచారించింది. ఆయన తండ్రిని, బంధువులను, మరికొందరిని ముమ్మరంగా ప్రశ్నిస్తూ దర్యాప్తును చివరి దశకు తీసుకొచ్చింది.

ఓవైపు కేసులు చుట్టుముడుతుంటే, మరోవైపు రాష్ట్ర ఎన్నికల సంఘం తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. దాంతో వైకాపా శిబిరంలో ఒక్కసారిగా వణుకు మొదలైంది. నాయకులంతా విలవిల్లాడిపోతున్నారు. మన అధినేత పరిస్థితి ఏమిటి, రెండో శ్రేణి నాయకుల భవిష్యత్తు ఏమిటి, అసలు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడమా? లేక పలాయనం చిత్తగించడమా? అంటూ వైకాపా శ్రేణులు తీవ్ర గందరగోళంలో, సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. వంద గుడ్లు తిన్న రాబందు ఒక్క గాలివానకు కుప్పకూలిపోయినట్లు.. సీబీఐ, ఈడీ కేసుల రోజువారీ విచారణ మొదలవుతోందన్న వార్త వినగానే జగన్ శిబిరం పేకమేడలా కకావికలమైపోయింది. భవిష్యత్తు ఏమిటో జగన్‌కి పూర్తిగా బోధపడింది. అందుకే గత రెండు మూడు రోజులుగా ఆయన పార్టీ నాయకులతోనో, కార్యకర్తలతోనో కాకుండా.. కేవలం న్యాయవాదులు, సుప్రీంకోర్టు లీగల్ ఎక్స్‌పర్టులతో చర్చల్లోనే తాడేపల్లి ప్యాలెస్‌లో తలమునకలవుతున్నారు. అధినేత లీగల్ కేసుల భయంతో తలదాచుకుంటుంటే, కింద క్యాడర్ మాత్రం దిక్కుతోచక రోడ్డున పడింది. తప్పులు చేసి ప్రజాధనాన్ని లూటీ చేసిన వారికి, కుటుంబ సభ్యుల హత్యల వెనుక నిజాలను తొక్కిపెట్టిన వారికి చట్టం ముందు తలవంచక తప్పదని జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా గ్రహించాలి. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి దారెటు? చట్టం ముందు మోకరిల్లడమా.. లేక ప్రజాగ్రహానికి గురికావడమా తేల్చుకోవాలని వర్ల రామయ్య అన్నారు.

**న్యాయస్థానాలతో 14ఏళ్లుగా ఆటలు..**

జగన్మోహన్ రెడ్డిపై సీబీఐ తొలి చార్జిషీటు దాఖలు చేసి దాదాపు పద్నాలుగు సంవత్సరాలు గడిచిపోయింది. పద్నాలుగేళ్లుగా డిశ్చార్జి పిటిషన్ల పేరుతో, చట్టంలోని చిన్నచిన్న లొసుగులను అడ్డుపెట్టుకుని, కోట్లాది రూపాయల ఫీజులు చెల్లించి పెద్ద పెద్ద న్యాయవాదులను పెట్టుకుంటూ విచారణ ముందుకు సాగకుండా అడుగడుగునా అడ్డుపడ్డారు. మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో గానీ, విభజిత రాష్ట్రంలో గానీ ఇన్ని అవినీతి కేసులు విచారణకు రాకుండా, బలహీనమైన కుంటిసాకులతో డిశ్చార్జి పిటిషన్లు వేస్తూ పద్నాలుగేళ్లు సాగదీసిన దాఖలాలు ఎక్కడైనా ఉన్నాయా? జగన్మోహన్ రెడ్డి ఇన్నేళ్లుగా వ్యవస్థలతో, న్యాయస్థానాలతో ఆడుకున్న ఆటలకు తెరపడింది. ఇప్పుడు సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాలతో పాటు, ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లపై న్యాయస్థానాలు రోజువారీ విచారణ చేపట్టాలని నిర్ణయించాయి. చట్టబద్ధంగా నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు సాహసోపేత నిర్ణయం తీసుకున్న న్యాయస్థానాలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన కోర్టుకు హాజరైతే భద్రతా సమస్యలు వస్తాయని, కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతుందని భావించి వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపులు ఇచ్చారు. ఇందులో తప్పుబట్టేందుకు ఏమీ లేదు. కానీ ఆయన ముఖ్యమంత్రి కుర్చీ దిగిపోయి ఇప్పటికే రెండున్నర సంవత్సరాలు దాటింది. ఒక సాధారణ ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తికి ఇంకా వ్యక్తిగత హాజరు విషయంలో ప్రత్యేక వెసులుబాట్లు, జాప్యాలు ఎందుకు..సీబీఐ ఇప్పటివరకు ఎందుకు చురుగ్గా కదలలేదు.. వ్యవస్థలు ఎందుకు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టలేకపోయాయనే ప్రశ్నలు నేడు సామాన్య పౌరులనుంచే వస్తున్నాయని వర్ల రామయ్య అన్నారు.

**భయంతో కుప్పిగంతులు..**

రాష్ట్ర ప్రజలు ఇప్పటికే జగన్మోహన్ రెడ్డిని పూర్తిగా పక్కన పెట్టేశారు, ఆయన్ను పట్టించుకోవడమే మానేశారు. మరోవైపు విచారణ వేగవంతమవుతోందన్న భయంతో జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా కుప్పిగంతులు వేస్తున్నారు. ఆయన పెడుతున్న అర్థంపర్థం లేని ట్వీట్లు, ఆయన ప్రవర్తన, వైకాపా వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే వారిలో గందరగోళం, తీవ్రమైన భయం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. చట్టం, ధర్మం తన పని తాను చేసుకుంటూ పోవాలి. వ్యవస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించి, ప్రజలకు న్యాయం జరుగుతోందన్న స్పష్టమైన విశ్వాసాన్ని కలిగించాలి. పద్నాలుగేళ్లుగా మూలనపడ్డ కేసుల ఫైళ్లు తెరుచుకుంటున్న వేళ.. ఇకపై ఎలాంటి జాప్యానికి తావులేకుండా ఈ విచారణను వేగంగా పూర్తి చేసి, చట్టం ముందు అందరూ సమానులేనని నిరూపించాలని కోరుతున్నట్లు వర్ల తెలిపారు.

**2021లో మీ అరాచకాలు గుర్తున్నాయా?**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసి కేంద్ర బలగాలను దించాలని, ఎన్నికలు సజావుగా జరపాలని వైకాపా నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేయడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. ఈ విషయంపై లేళ్ల అప్పిరెడ్డి కూడా లేఖలు రాశారు. నేరుగా వై.ఎస్. జగన్మోహన్ రెడ్డిని, ఆయన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2021లో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను ఏ విధంగా నడిపించారో ఈ రాష్ట్ర ప్రజలు ఇంకా మర్చిపోలేదు. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల చేతుల్లోని నామినేషన్ పత్రాలను లాక్కుని చించివేయలేదా? పోటీ చేయాలనుకున్నవారిపై దాడులు చేయించి, కిడ్నాప్‌లు చేయించి బలవంతపు ఏకగ్రీవాలు చేసుకోలేదా? అప్పటి పోలీసు యంత్రాంగాన్ని, ఎన్నికల అధికారులను మీ పార్టీ తొత్తులుగా మార్చి ప్రజాస్వామ్యాన్ని నడిరోడ్డుపై ఖూనీ చేయలేదా? అప్పుడు మీరు చేసిన ఆ అరాచక పద్ధతిలోనే ఇప్పుడు కూడా ఎన్నికలు నిర్వహించాలని అడిగే దమ్ము, ధైర్యం సజ్జలకు ఉన్నాయా?

సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వంలో ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో జరుగుతాయి. నామినేషన్లు వేయడానికి ఏ ఒక్కరికీ ఎలాంటి ఆటంకాలు ఉండవు.

గత వైకాపా పాలనలో జరిగినట్లుగా గూండాయిజానికి, అప్రజాస్వామిక విధానాలకు ఈ ప్రభుత్వంలో తావుండదు. పూర్తి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహిస్తామని మేం హామీ ఇస్తున్నాం. వాస్తవానికి వైకాపా నాయకత్వానికి వచ్చిన అసలు భయం ఎన్నికల నిర్వహణ కాదు. క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు, కేడర్ చేజారిపోతోందన్న భయం వారిని వెంటాడుతోంది. స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి కనీసం అభ్యర్థులు కూడా దొరకని దయనీయ స్థితిలో పడ్డారు. అందుకే పోటీ చేయలేక, ముఖం చెల్లక.. ఒకవైపు కేంద్ర బలగాలు కావాలని, మరోవైపు నామినేషన్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలంటూ సాకులు వెతుక్కుంటూ లేఖల డ్రామాలకు తెరతీస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఆనాడు నిరంకుశ విధానాలతో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన చరిత్ర మీది, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించి ప్రజాతీర్పును గౌరవించే సంస్కృతి మా తెలుగుదేశం పార్టీది. మీ ఓటమి భయాన్ని కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థలపై బురదజల్లడం మానుకోవాలని వర్ల రామయ్య హితవు పలికారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే కూటమి లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమమే కూటమి విజయానికి నాంది
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో గురువారం నిర్వహించిన అమలాపురం, రామచంద్రాపురం నియోజకవర్గాల స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశంలో ఎంపీ సానా సతీష్, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి సిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజుతో కలిసి మంత్రి సుభాష్ పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం మురమళ్లలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కార్యాలయంలో నిర్వహించిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వర్ సుంకర పావని, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయితో కలిసి మంత్రి పాల్గొన్నారు.

ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, కూటమి పార్టీల మధ్య సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ స్థానిక సంస్థల్లో విజయాలు, ఏకగ్రీవ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో 94% స్ట్రైక్ రేట్ సాధించిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా అంతకుమించి విజయం సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధితో స్థానిక ఎన్నికల్లో ఘన విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కూటమి పక్షాలతో సమన్వయం చేసుకొని చేయి చేయి కలిపి ముందుకు సాగుతామని పేర్కొన్నారు.



# యువతకు మెరుగైన భవిత కూటమి ప్రభుత్వ లక్ష్యం

- ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే చంద్రబాబు మార్క్ పాలన
- అధికారంలోకి వచ్చిన స్వల్ప వ్యవధిలోనే రెండు డీఎస్సీలు
- మెగా డీఎస్సీలో 16,347 పోస్టుల భర్తీ
- 148 రోజుల్లోనే పారదర్శకంగా నిర్వహణ
- తాజా డీఎస్సీతో మరో 2,721 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్
- రూ.29 లక్షల కోట్ల పెట్టుబడులతో యువతకు ఉద్యోగావకాశాలు
- మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత



అమరావతి (చైతన్యరథం): యువతకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కూటమి మార్క్ పాలన అని మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత అన్నారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ డీఎస్సీ అంటేనే చంద్రబాబు నాయుడు గుర్తుకు వస్తారని, ఇచ్చిన మాటకు నిలువెత్తు సాక్ష్యంగా కూటమి ప్రభుత్వం కొలువుల జాతర చేపట్టిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయుల్లో దాదాపు 70 శాతం మంది తెలుగుదేశం పార్టీ హయాంలోనే నియమితులయ్యారని చెప్పడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. తాను కూడా ఒక ఉపాధ్యాయురాలినని, గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హయాంలో నిర్వహించిన డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగం పొందానని తెలిపారు. ఇది తనకు ఎంతో సంతోషాన్ని కలిగించే విషయమని పేర్కొన్నారు. నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపింది చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ అని పీతల సుజాత అన్నారు. ప్రతి సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తామంటూ గొప్పలు చెప్పిన గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని విమర్శించారు. వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రజలెవరూ ఎప్పటికీ మర్చిపోరని పేర్కొన్నారు. మద్యం దుకాణాల వద్ద ఉపాధ్యాయులను కాపలాగా పెట్టి ఉపాధ్యాయ వృత్తికే వైసీపీ ప్రభుత్వం కళంకం తెచ్చిందన్నారు. ఇది జగమెరిగిన సత్యమని, ఉపాధ్యాయులెవరూ ఈ విషయాన్ని తమ జీవితంలో మర్చిపోరని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే రెండు డీఎస్సీలను నిర్వహించామని పీతల సుజాత వెల్లడించారు. మొదట మెగా డీఎస్సీ నిర్వహించామని, తాజాగా రెండో డీఎస్సీకి కూడా నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉందని, చేసేదే చెబుతామని, చెప్పిందే చేస్తామని స్పష్టం చేశారు. తాజాగా విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 2,721 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మెగా డీఎస్సీ ద్వారా 16,347 పోస్టులను భర్తీ చేశామని వెల్లడించారు. దేశంలో మరే ప్రభుత్వం నిర్వహించని విధంగా పెద్ద సంఖ్యలో పోస్టులను భర్తీ చేయడంతోపాటు అత్యంత పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేశామని పేర్కొన్నారు. కేవలం 148 రోజుల్లోనే మెగా డీఎస్సీని నిర్వహించామని సుజాత గుర్తు చేశారు.

**యువతకు అండగా ప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించామని పీతల సుజాత అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంత తక్కువ వ్యవధిలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయలేదన్నారు. ఈ ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు దక్కుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 26 నెలల్లోనే రూ.29 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి యువతకు ప్రాధాన్యతనిచ్చామని వెల్లడించారు. ఈ పెట్టుబడుల ద్వారా ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమం అవుతుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ యువతకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. గూగుల్, గ్రీన్‌కో వంటి ఎన్నో సంస్థలను రాష్ట్రానికి తీసుకువస్తూ మంత్రి లోకేష్ యువతకు అండగా నిలుస్తున్నారని పీతల సుజాత అన్నారు. యువతకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామనడానికి డీఎస్సీ నోటిఫికేషన్లే నిలువెత్తు సాక్ష్యమని పేర్కొన్నారు. ఒకవైపు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూనే, మరోవైపు నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్న నారా లోకేష్‌కు అభినందనలు తెలియజేశారు. నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఆమె అన్నారు. అనవసరమైన మొబైల్ యాప్‌ల భారాన్ని తొలగించి ఉపాధ్యాయులకు ఒత్తిడి లేని పని వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సాల్ట్ కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయులకు అంతర్జాతీయ స్థాయి వృత్తి నైపుణ్య శిక్షణ కూడా అందిస్తున్నామని సుజాత వెల్లడించారు.

**మెరుగుపడిన విద్యావ్యవస్థ**

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని పేర్కొన్నారు. ఆ వృత్తి గౌరవానికి భంగం కలగకుండా, ఉపాధ్యాయుల ప్రతిష్టను కాపాడుతూ విద్యాశాఖ మంత్రి లోకేష్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాఠశాలల్లో యూనిఫారాల నుంచి మధ్యాహ్న భోజనం, పుస్తకాల వరకు అన్నింటిలోనూ నాణ్యతకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరుస్తూ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. విద్యతోనే వికాసం.. ఉద్యోగాలతోనే ఉపాధి.. అనే నినాదంతో దశాబ్దాలుగా దార్శనిక నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ అడుగులు వేస్తోందన్నారు. మెగా డీఎస్సీకి బ్రాండ్ తెలుగుదేశం ప్రభుత్వమేనని పేర్కొంటూ యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాలను కల్పించడమే ధ్యేయంగా మరిన్ని నోటిఫికేషన్లు విడుదల చేస్తామని తెలిపారు. యువత కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. మెగా డీఎస్సీని తక్కువ వ్యవధిలో, పూర్తి పారదర్శకతతో నిర్వహించి, పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికే ఉపాధ్యాయులను నియమించామని వివరించారు. తద్వారా విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగించేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. తాజాగా విడుదల చేసిన రెండో డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా కూడా యువత బాగా చదువుకొని ఉద్యోగాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు పీతల సుజాత వెల్లడించారు.

## సీజేపీ, జగన్ అసలు రంగు బయటపడింది

**- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మాధవ్**



అమరావతి (చైతన్యరథం): ఆర్థిక నేరాలకు పాల్పడి వేల కోట్ల రూపాయల అక్రమాస్తులు పోగేసుకున్న జగన్ రెడ్డితో చేతులు కలపటం ద్వారా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అసలు రూపం బయట పడిందని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ధ్వజమెత్తారు. వైసీపీ–సీజేపీ బంధంపై మాధవ్ ఘాటుగా స్పందించారు. ఆర్థిక నేరాలకు పాల్పడిన జగన్‌తో సీజేపీ చేతులు కలిపిదంటూ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యతిరేక పోరాటం, ప్రజాస్వామ్య పరిరక్షణ అంటూ నినాదాలు చేసే సీజేపీ.. అవినీతి ఆరోపణలకు సంబంధించి ఈడీ, సీబీఐ కేసులను ఎదుర్కొంటున్న జగన్‌తో చేతులు కలపడంతో అసలు అజెండా స్పష్టమవుతోందన్నారు. మరోపక్క ఐదేళ్ల పాలనలో మత విద్వేషంతో రాష్ట్రంలోని దేవాలయాల విధ్వంసం, రథాల దగ్ధం, విగ్రహాల శిరచ్ఛేదాలను, దేవాలయాల ఆస్తుల ఆక్రమణలను, మత మార్పిడులను ప్రోత్సహించడంతో పాటు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన జగన్.. నేడు రాజకీయ లబ్ధి కోసం దేశ విచ్ఛిన్నకర శక్తులతో చేతులు కలిపి తన నిజ స్వరూపాన్ని బట్టబయలు చేశాని వ్యాఖ్యానించారు.

రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రతిపక్షాల హక్కులు, రాజకీయ స్వేచ్ఛకు ఎదురైన సవాళ్లను, ప్రజలు పడిన ఇబ్బందులను, అవినీతి ఆరోపణలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదని మాధవ్ అన్నారు. శాంతియుత నిరసన ప్రజాస్వామ్య హక్కు అని... కానీ హింస, రాళ్లదాడులు, పోలీసులపై దాడులు, మహిళల పట్ల అనుచిత ప్రవర్తన, భద్రతా సిబ్బందిపై దాడులకు ప్రజాస్వామ్యంలో చోటులేదని స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే పోలీసుల చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం మాజీ సీఎంకు బాధ్యతాయుతమైన వైఖరి కాదని అన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పుకునే సీజేపీ, అవినీతి కేసులను ఎదుర్కొంటున్న జగన్‌తో కలిసి పనిచేయడం వారి నినాదాలకు, ఆచరణకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని స్పష్టం చేస్తోందని మాధవ్ విమర్శించారు. ప్రజాస్వామ్యం పేరుతో దేశంలో అస్థిరత, విధ్వంసాన్ని సృష్టించేందుకు ప్రయత్నిస్తున్న శక్తులతో కలిసి జగన్ సాగిస్తున్న రాజకీయ ప్రయత్నాలను రాష్ట్ర ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని.. తగిన సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా తీర్పును వెల్లడిస్తారని ఎక్స్‌లో మాధవ్ పోస్ట్ చేశారు.

## సర్వభూపాల వాహనంపై మలయప్ప స్వామి

తిరుమల (చైతన్యరథం): తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం రాత్రి శ్రీ మలయప్ప స్వామివారు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి అలంకారంలో సర్వభూపాల వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు నాలుగు మాడ వీధుల్లో వైభవంగా విహరించి భక్తులను అనుగ్రహించారు.

వాహనం ముందు గజరాజులు నడుస్తుండగా, భక్తబృందాల చెక్కభజనలు, జీయ్యంగార్ల గోష్టి, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అంగరంగ వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు.



**సర్వభూపాల వాహనసేవలో విశేష ఆధ్యాత్మిక సందేశం**

సర్వభూపాల అంటే సమస్త రాజులు అని అర్థం. అష్టదిక్పాలకులైన ఇంద్రుడు, అగ్ని, యముడు, నిరృతి, వరుణుడు, వాయువు, కుబేరుడు, పరమేశ్వరుడు లోకాలను పరిరక్షించే శక్తులకు ప్రతీకలుగా నిలుస్తారు. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై మోస్తూ సేవించడం ఈ వాహనసేవ ప్రత్యేకత. ప్రజలను ధర్మబద్ధంగా పరిపాలిస్తూ, భగవంతుని ఆశీస్సులతో లోక క్షేమానికి కృషి చేయాలనే సందేశాన్ని సర్వభూపాల వాహనసేవ చాటిచెబుతుంది.



ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు జానకిదేవి, నన్నపనేని సదాశివరావు, నరేష్ కుమార్, పూర్ణ సాంబశివరావు, జేఈవోలు డా. ఎ. శరత్, ప్రభల గోపీనాథ్, సీవీఎస్వో మురలీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పులివెందులలో టీడీపీలోకి 20 కుటుంబాలు

**- టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి సమక్షంలో చేరికలు**



పులివెందుల (చైతన్యరథం): సొంత నియోజకవర్గం పులివెందులలో జగన్ రెడ్డికి షాక్ తగిలింది. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డుకు చెందిన కొమ్మెర విజయ్, కొమ్మెర వినోద్, దేరంగుల ఈశ్వర్‌తో పాటు పలువురు గురువారం వైసీపీకి నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. పెనుగొండ చిన్న తరుణ్ (ఆర్ 15 చిన్న), తూగుట్ల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 20 కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో పులివెందులలో తెలుగుదేశం పార్టీకి ప్రజల నుంచి వస్తున్న స్పందనకు ఈ చేరికలు నిదర్శనమని పేర్కొన్నారు. 8వ వార్డుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కుటుంబంలో చేరడం సంతోషకరమని, పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. పులివెందుల పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన, వార్డుల అభివృద్ధి తమ ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ, పులివెందుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని బీటెక్ రవి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దు, హజ్ డైరెక్టర్ మహబూబ్ బాష, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి, ఏపీ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ, పార్టీ నాయకులు, కేంద్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అబ్దుల్ కలాంను స్ఫూర్తి శిఖరంగా అభివర్ణించారు. దేశ అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త మార్గనిర్దేశనం చేసిన దార్శనికుడు అని కొనియాడారు.

# ఇంట్లోకి దూరి వైసీపీ నేతల దౌర్జన్యం, దాడి

- **18 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమికి పట్టా నిరాకరణ**
- **22-ఏ భూములకు అక్రమ పట్టాలు**
- **సాగులో ఉన్న భూమికి వేరొకరి పేరుతో పట్టా**
- **న్యాయం కోసం టీడీపీ కేంద్ర కార్యాలయంలో బాధితుల వినతులు**
- **అర్జీలు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్**



అమరావతి (చైతన్యరథం): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమానికి వివిధ సమస్యలపై తరలి వచ్చిన ప్రజలు వినతులు సమర్పించారు. అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించిన గ్రీవెన్స్ మేనేజర్ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామానికి చెందిన రేపూరి అబ్రహం అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. టీడీపీ కార్యకర్త అయినా తనపై గత నెల 9వ తేదీ రాత్రి సుమారు 10:00 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు, అతడి ఏడుగురు అనుచరులు కలిసి పథకం ప్రకారం తన ఇంటిపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. ఇంటి కాంపౌండ్ వాల్ దూకి లోపలికి ప్రవేశించిన దుండగులు, ఇంట్లోకి చొరబడి తమపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. రక్తపు మడుగులో అపస్మారక స్థితికి చేరుకోవడంతో చనిపోయాడని భావించిన దుండగులు మళ్లీ గోడ దూకి అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందించారు. వారిపై చర్యలు తీసుకుని తమకు రక్షణ కల్పించాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం గిరినగర్ కు చెందిన బండి శ్రీనివాసులు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. మహబూబ్‌నగర్ గ్రామ పరిధిలోని సర్వే నెం. 1011/2 లోని 70 సెంట్ల భూమిని 18 ఏళ్లకు పైగా తాను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ప్రస్తుతం అందులో వరి పంట కూడా వేశానని తెలిపారు. ఆ భూమికి పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎన్నో ఏళు ్లగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. అదేవిధంగా సర్వే నెం. 1011 లోని భూమిని సబ్ డివిజన్ చేసి ఇతర వర్గాల వారికి పట్టాలు మంజూరు చేసిన అధికారులు, దళితుడినైన తనకు మాత్రం రకరకాల సాకులు చెబుతూ పట్టా నిరాకరిస్తున్నారు. ఒకసారి చుక్కల భూమి అని, మరోసారి సాగులో లేదని అవాస్తవాలు చెబుతూ అన్యాయం చేస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన మోమిన్ సైదల్లి గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. అమరావతి మండలంలో చారిత్రక అమరలింగేశ్వర స్వామి దేవాలయ భూములు, కృష్ణా నది లంక భూములు, సెక్షన్ 22- ఏ పరిధిలోని నిషేధిత భూములను అక్రమంగా మ్యుటేషన్లు చేసిన రెవెన్యూ అధికారులు కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. అయితే వందల ఎకరాల దేవదాయ, అసైన్డ్, లంక భూములను స్వాహా చేసిన అధికారిపై కేవలం అభియోగ పత్రం నమోదు చేసి ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. విచారణ ఎదుర్కొంటున్న వ్యక్తికే తిరిగి అదే మండలంలో పోస్టింగ్ ఇచ్చారు. ఈ భారీ భూ కుంభకోణంపై పూర్తి ఆధారాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసినప్పటికీ, అధికారులు ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారు. అధికారుల ఇష్టారాజ్యం వల్ల దేవుడి మాన్యాలు, పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు అన్యాక్రాంతమైపోతున్నాయి. తగు చర్యలు తీసుకోని అమరావతి మండలంలో జరిగిన అక్రమ మ్యుటేషన్లపై తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణ జరిపించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు.

సత్యసాయి జిల్లా అమడగూరు మండలం తుమ్మల గ్రామానికి నాగరిపింటి చిన్న గంగమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 370-9 లోని సుమారు 1.38 ఎకరాల భూమిని తాను ఎన్నో ఏళ్లుగా స్వయంగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అక్రమ మార్గాల్లో ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాస్ పుస్తకం పొందారు. ఈ భూమి విషయమై గత పదేళ్లుగా తనతో నిరంతరం గొడవలకు దిగుతూ, పలుమార్లు తనపై భౌతిక దాడులకు సైతం పాల్పడ్డారు. గత పదేళ్ల కాలంలో ఎంతోమంది తహసీల్దార్లు మారినప్పటికీ, ఆ తప్పుడు పాస్ పుస్తకాన్ని రద్దు చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. ఇప్పటివరకు తనకు ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన బాడిశ హనుమంతరావు విజ్ఞప్తి చేస్తూ.. తన తల్లిదండ్రుల నుంచి వచ్చిన స్థిరాస్తితో పాటు, ఏపీఎస్ఈబీలో పనిచేస్తున్నప్పుడు సంస్థ నుంచి తీసుకున్న రుణం రూ. 40,000తో తాను స్వయంగా ఇల్లు నిర్మించుకున్నానని తెలిపారు. అలాగే తన మూడో అన్నయ్య, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన బాడిశ గోపయ్య వద్ద నుంచి కొనుగోలు చేసిన 2 సెంట్ల ఖాళీ స్థలం కూడా తన ఆధీనంలో ఉండేది. అయితే తాను 40 ఏళ్లుగా టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నాననే రాజకీయ కక్షతో తమ గ్రామానికే చెందిన ఒక వ్యక్తి తన ఆస్తిని దౌర్జన్యంగా ఆక్రమించుకున్నాడు. దీనిపై గతంలో 10 ఏళ్ల పాటు కోర్టులో పోరాడినప్పటికీ, సాక్షులను బెదిరించిన ప్రత్యర్థి న్యాయం జరగకుండా అడ్డుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు స్థలాన్ని సర్వే చేశారు. సర్వేయర్ పరిశీలనలో తన భూమిని సదరు వ్యక్తి ఆక్రమించినట్లు స్పష్టంగా తేలింది. అయితే సదరు సర్వే నివేదిక ఉన్నతాధికారులకు చేరకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే మాయం చేశారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా అమడగూరు మండలం తుమ్మల గ్రామానికి చెందిన ఆదిలక్ష్మమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నంబర్ 107 లోని 3 ఎకరాల 80 సెంట్లు, 2 ఎకరాల 10 సెంట్లు వ్యవసాయ భూమి తన పేరున ఉండి, ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబ స్వాధీనంలో సాగులో ఉందని తెలిపారు. సదరు భూమితో ఎలాంటి సంబంధం లేని ఒక మహిళ రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి, దొంగతనంగా ఆమె పేరిట పట్టాదారు పాసుపుస్తకం చేయించుకున్నారు. గడచిన 15 సంవత్సరాలుగా ఈ విషయమై స్థానిక ఎమ్మార్వో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా, ఎంతమంది అధికారులు మారినా పట్టించుకోలేదు. ఈ సమస్యపై గతంలో ఫిర్యాదులు చేసినా, వివాదాలు జరుగుతున్నా స్థానిక రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్ కడప జిల్లా సిద్ధవటం మండలం మాధవరం-1 (ఎస్.కె.ఆర్. నగర్)కు చెందిన శ్రీనివాసులు విజ్ఞప్తి చేస్తూ.. తన కొడుకు యుగంధర్ (36) పంచాయతీరాజ్ శాఖలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తూ, కొడలు వనజ, ముగ్గురు పిల్లలతో కలిసి ఎస్.కె.ఆర్. నగర్‌లో నివసిస్తున్నాడని తెలిపారు. గత మూడేళ్లుగా భార్యాభర్తల మధ్య విభేదాలు నెలకొన్నాయి. దీనికి కొడలి కుటుంబ సభ్యులు కొందరు తన కొడుకును భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇటీవల యుగంధర్‌పై. తనపై దాడి కూడా చేశారు. గతంలో సిద్ధవటం పోలీసులకు విన్నవించినా తగిన చర్యలు తీసుకోలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు మండలం పిల్లారికుప్పం గ్రామానికి చెందిన  విజ్ఞప్తి చేస్తూ.. తూంగుండ్రం గ్రామ లెక్కల ప్రకారం సర్వే నంబర్ 351/2 లోని 37 సెంట్లు, సర్వే నంబర్ 351/5 లోని 47 సెంట్లు భూమి తమ కుటుంబం ఆధీనంలో ఉందన్నారు. 75 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న ఈ భూమిని ఇటీవల జరిగిన వైఎస్సార్ జగనన్న / గ్రామ రీసర్వేలో ఏ కారణం లేకుండా 'అనాధీన' ఖాతా కింద నమోదు చేశారు. దీనిపై తహశీల్దార్, ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌లకు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. తమ తాత స్వర్గీయ ఉప్పు బూసిశెట్టి కాలం నుంచి అనుభవంలో ఉన్న సర్వే నంబర్ 351/3 లోని 1 ఎకరా 11 సెంట్లు భూమిని గ్రామస్తులైన ఎం. చంద్రశేఖర్, సుబ్రమణ్యం రెడ్డి అనే వ్యక్తులు అక్రమంగా ఆక్రమించుకున్నారు. అదేవిధంగా సర్వే నంబర్ 372/7 లోని 12 సెంట్లు తమ భూమిని పక్క భూమి యజమాని అతడి ఆన్‌లైన్‌లో తారుమారు చేసి నమోదు చేసుకున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి న్యాయం జరగలేదు. తగు చర్యలు తీసుకుని తమ సమస్యన పరిష్కరించాలని కోరారు.

సత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం వీరపురం గ్రామానికి చెందిన సుగుణమ్మ విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామంలో సర్వే నెం. 145-2 లోని 5.25 ఎకరాల భూమి తన అత్త గంగమ్మ వీలునామా ప్రకారం తనకు సంక్రమించిందని తెలిపారు. ఈ భూమికి సంబంధించి పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోగా విచారణ జరిపించారు. గ్రామ రికార్డుల ప్రకారం సదరు సర్వే నెం. 145-2 భూమి చుక్కల భూమిగా నమోదై ఉంది. వెబ్‌ల్యాండ్ అడంగల్ ప్రకారం ఖాతా నెం. 190 లో ఈ భూమి 'గంగమ్మ భర్త నరసింహప్ప' పేరుపై ఉంది. అయితే, ఈ భూమి ప్రస్తుతం వివాదాస్పద భూముల రిజిస్టర్ లో నమోదై ఉండటంతో పాటు, 2003లో చేసిన ఫ్రీ హోల్డ్ భూముల జాబితా పరిధిలో ఉంది. తగు చర్యలు తీసుకని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థిక తోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# కూటమి సీట్ల సర్దుబాటు ఖరారు

- **పట్టణ స్థానిక ఎన్నికల్లో పోటీపై ఉమ్మడి నిర్ణయం**
- **కార్పొరేషన్లలో టీడీపీకి 11, జనసేనకి 4, బీజేపీకి 2**
- **మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టీడీపీ 78, జనసేన 21, బీజేపీ 7 స్థానాలు**

అమరావతి(చైతన్యరథం): పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే స్థానాలపై కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నిర్ణయానికి వచ్చాయి. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, ఎంపీ లింగమనేని రమేష్ తదితరులు భేటీ అయ్యారు.

సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం ఏ పార్టీ ఎక్కడి నుంచి పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు జాబితాను విడుదల చేశారు. మున్సిపల్ కార్పొరేషన్లలో టీడీపీ 11 స్థానాల్లో, జనసేన 4, బీజేపీ 2 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో టీడీపీకి 78 స్థానాల్లో, జనసేన 21 స్థానాల్లో, బీజేపీ 7 స్థానాల్లో పోటీ చేయనున్నాయి.

### 1. మున్సిపల్ కార్పొరేషన్లు (మొత్తం: 17)

శ్రీకాకుళం: జనసేన
విజయనగరం: టీడీపీ
గ్రేటర్ విశాఖపట్నం: టీడీపీ
కాకినాడ: జనసేన
రాజమహేంద్రవరం: బీజేపీ
ఏలూరు: జనసేన
మచిలీపట్నం: టీడీపీ
విజయవాడ: జనసేన
మంగళగిరి–తాడేపల్లి: టీడీపీ
గుంటూరు: టీడీపీ
ఒంగోలు: టీడీపీ
నెల్లూరు: టీడీపీ
కడప: టీడీపీ
కర్నూలు: టీడీపీ
అనంతపురం: బీజేపీ
తిరుపతి: టీడీపీ
చిత్తూరు: టీడీపీ

### 2. మున్సిపాలిటీలు మరియు నగర పంచాయతీలు (మొత్తం: 106)

ఇచ్ఛాపురం: టీడీపీ
పలాస కాశీబుగ్గ: టీడీపీ
ఆమదాలవలస: టీడీపీ
రాజాం: జనసేన
పాలకొండ: జనసేన
పార్వతీపురం: టీడీపీ
సాలూరు: జనసేన
బొబ్బిలి: టీడీపీ
నెల్లిమర్ల: బీజేపీ
ఎలమంచిలి: బీజేపీ
నర్సీపట్నం: టీడీపీ
తుని: జనసేన
ఏలేశ్వరం: టీడీపీ
గొల్లప్రోలు: జనసేన
పిఠాపురం: జనసేన
పెద్దాపురం: టీడీపీ
సామర్లకోట: జనసేన
రామచంద్రపురం: టీడీపీ
ముమ్మిడివరం: జనసేన
అమలాపురం: జనసేన
మండపేట: టీడీపీ
కొవ్వూరు: టీడీపీ
నిడదవోలు: జనసేన
పాలకొల్లు: టీడీపీ
నరసాపురం: జనసేన
భీమవరం: జనసేన
ఆకివీడు: టీడీపీ
తణుకు: టీడీపీ
తాడేపల్లిగూడెం: జనసేన
చింతలపూడి: టీడీపీ
జంగారెడ్డిగూడెం: టీడీపీ
తిరువూరు: జనసేన
నూజివీడు: టీడీపీ
గుడివాడ: టీడీపీ
పెడన: జనసేన
తాడిగడప: టీడీపీ
వుయ్యూరు: టీడీపీ
కొండపల్లి: టీడీపీ
నందిగామ: టీడీపీ
జగ్గయ్యపేట: టీడీపీ
పొన్నూరు: టీడీపీ
రేపల్లె: టీడీపీ
తెనాలి: జనసేన
బాపట్ల: బీజేపీ
చిలకలూరిపేట: జనసేన
నరసరావుపేట: టీడీపీ
సత్తెనపల్లి: టీడీపీ
వినుకొండ: టీడీపీ
దాచేపల్లి: టీడీపీ
గురజాల: టీడీపీ
పిడుగురాళ్ల: టీడీపీ
మాచర్ల: టీడీపీ
దర్శి: జనసేన
అద్దంకి: టీడీపీ
చీరాల: టీడీపీ
చీమకుర్తి: టీడీపీ
కందుకూరు: టీడీపీ
మార్కాపురం: టీడీపీ
పొదిలి: టీడీపీ
గిద్దలూరు: బీజేపీ
కనిగిరి: టీడీపీ
అల్లూరు: టీడీపీ
కావలి: బీజేపీ
ఆత్మకూరు(నెల్లూరు): టీడీపీ
బుచ్చిరెడ్డిపాలెం: టీడీపీ
గూడూరు: టీడీపీ
నాయుడుపేట: టీడీపీ
సూళ్లూరుపేట: టీడీపీ
వెంకటగిరి: టీడీపీ
బద్వేలు: టీడీపీ
రాజంపేట: టీడీపీ
రాయచోటి: టీడీపీ
పులివెందుల: టీడీపీ
కమలాపురం: టీడీపీ
జమ్మలమడుగు: టీడీపీ
ఎర్రగుంట్ల: బీజేపీ
ప్రొద్దుటూరు: టీడీపీ
మైదుకూరు: టీడీపీ
ఆళ్లగడ్డ: టీడీపీ
ఆత్మకూరు (నంద్యాల): టీడీపీ
నందికొట్కూరు: టీడీపీ
నంద్యాల: టీడీపీ
బేతంచెర్ల: టీడీపీ
డోన్: టీడీపీ
గూడూరు (కర్నూలు): బీజేపీ
ఎమ్మిగనూరు: టీడీపీ
ఆదోని: టీడీపీ
రాయదుర్గం: టీడీపీ
గుత్తి: టీడీపీ
గుంతకల్లు: టీడీపీ
తాడిపత్రి: టీడీపీ
కళ్యాణదుర్గం: టీడీపీ
మడకశిర: జనసేన
హిందూపురం: టీడీపీ
పెనుకొండ: టీడీపీ
పుట్టపర్తి: జనసేన
ధర్మవరం: టీడీపీ
కదిరి: టీడీపీ
బి.కొత్తకోట: టీడీపీ
మదనపల్లె: టీడీపీ
పుంగనూరు: టీడీపీ
శ్రీకాళహస్తి: టీడీపీ
నగరి: టీడీపీ
పుత్తూరు: జనసేన
పలమనేరు: టీడీపీ
కుప్పం: టీడీపీ

# జగన్ శిబిరంలో కలవరం!

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమర శంఖారావం పూరించిన వేళ రాష్ట్ర రాజకీయం అనూహ్యంగా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఒకవైపు రాజకీయ పార్టీలు ఎన్నికల సమరానికి సన్నద్ధం అవుతుంటే మరోవైపు కేసుల విచారణతో వైసీపీ కొత్త సవాళ్లు ఎదుర్కొంటోంది. ఎన్నికల సమరానికి రాజకీయ పార్టీలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలకు పదునుపెడుతున్నాయి. గ్రామ స్థాయి నుంచి పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేసుకుంటూ అభ్యర్థుల ఎంపిక, సామాజిక సమీకరణాలు, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, ప్రచార ప్రణాళికలతో ముందుకు సాగాల్సిన కీలక సమయంలో వైసీపీకి న్యాయపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి. దశాబ్దకాలంగా పెండింగులో ఉన్న జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ వేగవంతం కావడంతో స్థానిక ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాల్సిన వైసీపీ నాయకత్వానికి న్యాయపరమైన పరిణామాలు అదనపు భారంగా మారాయి. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తొలిరోజే మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చుట్టూ చట్టం ఉచ్చు బిగించేందుకు సిద్ధం అవ్వడంతో జగన్ శిబిరంలో కలవరం మొదలైంది. జగన్ అక్రమాస్తుల కేసులను రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయం తీసుకుంది. కూటమి పార్టీలు స్థానిక పోరులో అభ్యర్థుల ఎంపిక, సీట్ల సర్దుబాట్లతో దూకుడు ప్రదర్శిస్తుంటే... మరోవైపు వైసీపీ మాత్రం వరుస విచారణలు, అరెస్టుల భయంతో ఊపిరాడని న్యాయ పోరాటాల సుడిగుండంలో చిక్కుకుంది. ఐదు వైపుల నుంచీ కేసుల ఉచ్చు బిగుస్తోంది. కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, సీఐడీలు ఒక్కసారిగా దూకుడు పెంచడంతో వైసీపీ శిబిరం ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతోంది.

**దశాబ్ద కాలపు కేసులకు కదలిక**

దశాబ్ద కాలంగా సాగుతున్న జగన్ అక్రమాస్తుల కేసులపై హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు తీసుకున్న రోజువారీ విచారణ నిర్ణయం వైసీపీకి కోలుకోలేని దెబ్బ. కేసుల విచారణ జాప్యానికి ఇక ఆస్కారం లేకపోవడంతో జగన్ వర్గానికి నిద్ర కరువైంది. జగన్ అక్రమాస్తుల కేసులు 2011లో సీబీఐ దర్యాప్తు ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా ఉన్నాయి. జగన్ అక్రమాస్తుల కేసులు నిన్నమొన్నటివి కావు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కొన్ని కంపెనీలకు ప్రభుత్వపరమైన ప్రయోజనాలు కల్పించారనే ఆరోపణలు, వాటికి ప్రతిఫలంగా జగన్‌తో సంబంధం ఉన్న సంస్థల్లో పెట్టుబడులు వచ్చాయనే అభియోగాలు ఈ కేసులకు నేపథ్యం. ఈ వ్యవహారంలో సీబీఐ అవినీతి ఆరోపణలపై కేసులు నమోదు చేయగా, ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది. ఇంతకాలం సాగుతున్న ఈ వ్యవహారంలో విచారణను వేగవంతం చేయాలన్న ఈడీ ప్రయత్నాలు ఇప్పుడు కీలకంగా మారాయి. డిశ్చార్జ్ పిటిషన్ల పెండింగ్ కారణంగా విచారణలో జాప్యం జరుగుతోందని దర్యాప్తు సంస్థ న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్లింది. దీనికి రోజువారీ విచారణ దిశగా చోటుచేసుకున్న పరిణామాలు జగన్ అక్రమాస్తుల వ్యవహారానికి సంబంధించి సీబీఐ కేసులతో పాటు మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ నమోదు చేసిన కేసులు కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ కేసుల్లో కూడా రోజువారీ విచారణ చేపట్టాలన్న ఈడీ అభ్యర్థన, దానిపై న్యాయస్థానాల్లో చోటుచేసుకున్న పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

**జగన్ శిబిరంలో వివిధ కేసులు రాజకీయ ఒత్తిడి!**

జగన్‌కు సంబంధించిన అక్రమాస్తుల వ్యవహారం ఒక్కటే కాదు. బాబాయి వివేకా హత్య, ఓబులాపురం గనుల వ్యవహారం, మద్యం విధానానికి సంబంధించిన ఆరోపణలు, తిరుమల లడ్డూ వివాదానికి సంబంధించిన దర్యాప్తులు వంటి పలు అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు వచ్చాయి. వీటిలో ఒక్కో కేసుకు ఒక్కో నేపథ్యం, ఒక్కో దర్యాప్తు పరిధి, ఒక్కో న్యాయపరమైన ప్రక్రియ ఉన్నాయి. మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన, సంచలనాత్మకమైన వ్యవహారం. 2019 ఎన్నికలకు ముందు జరిగిన ఈ హత్య అప్పటి నుంచీ అనేక మలుపులు తిరుగుతోంది. హత్యకు సంబంధించిన నేర విచారణతో పాటు దాని వెనుక ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆర్థిక లావాదేవీలపై కూడా దర్యాప్తు సంస్థలు దృష్టిసారించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని ఈడీ విచారించింది. మరోవైపు కోట్లాది మంది భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడిన తిరుమల లడ్డూ తయారీలో కల్తీ రసాయనాలు కలిసిన నెయ్యి వాడిన కేసులో ఈడీ రంగంలోకి ఈ కేసులో నిందితుల ఆస్తులను జప్తు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో వైసీపీ నాయకత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది. ఓబులాపురం గనుల కేసులో హైదరాబాద్ సీబీఐ కోర్టుకు రిటైర్డ్ ఐఏఎస్ శ్రీలక్ష్మి హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి మళ్లీ కోర్టు బోనులో నిలబడాల్సి రావడం... నాటి నిర్ణయాల వెనుక ఉన్న ముఖాలు బయటపడతాయన్న ఆందోళన చెందుతున్నారు. జగన్ హయాంలో జరిగిన మద్యం స్కామ్‌లో సీనియర్ ఐఏఎస్ అధికారి రజత్ భార్గవ ఈడీ ఎదుట హాజరుకావడంతో... లిక్కర్ కమీషన్ల ముఠా మూలాలు ఎక్కడి వరకు దారితీస్తాయోనన్న భయం వైసీపీని వెంటాడుతోంది. విచారణ ఎదుర్కొంటున్న బాబాయ్ దారుణ హత్య, తిరుమల శ్రీవారి ప్రసాదంలో అపచారం, కోట్ల రూపాయల మద్యం స్కామ్ వంటి ప్రజా వ్యతిరేక అంశాలు ఆధారాలతో కూడిన తీవ్ర ఆరోపణలు ప్రజల్లోకి వెళ్లడంతో జగన్ శిబిరం కలవర పడుతోంది. ఇన్నాళ్లూ నిద్రావస్థలో ఉన్న కేసులన్నీ జగన్ అండ్ కో మెడను ఒక్కసారిగా అనకొండలా చుట్టుకోబోతున్నాయి.

**వైసీపీ రాజకీయ వ్యూహాలకు సవాల్!**

స్థానిక ఎన్నికలకు రాజకీయ పార్టీలు సన్నద్ధమవుతూ గెలుపే లక్ష్యంగా ప్రచారంలోకి దూసుకెళ్తున్నాయి. మరోవైపు దశాబ్దకాలంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న జగన్ అక్రమాస్తుల వ్యవహారం విచారణ వేగం పుంజుకోవడంతో వైసీపీ నేతలు మాత్రం ఏ కేసులో ఎవరు అరెస్ట్ అవుతారో, ఏ ఐఏఎస్ అధికారి ఎవరి పేరు బయటపెడతారో నన్న భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. పార్టీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేయాల్సిన నాయకత్వం, న్యాయ నిపుణులతో అత్యవసర సమావేశాలు నిర్వహించడానికే సమయం సరిపోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఏ రాజకీయ పార్టీకైనా సంస్థాగత బలం, గ్రామస్థాయి ప్రజాదరణ, నాయకత్వ సామర్థ్యాన్ని పరీక్షించే వేదిక. అభ్యర్థుల ఎంపిక, స్థానిక నాయకుల మధ్య సమన్వయం, సామాజిక సమీకరణాలు, ప్రచార వ్యూహాలు, పార్టీ శ్రేణులను చైతన్య పరచడం వంటి అంశాలు కీలకంగా మారతాయి. ఎన్నికల సమయంలో పార్టీ అధినేతకు సంబంధించిన సుదీర్ఘకాలపు కేసులు విచారణ చేపట్టడంతో రాజకీయంగా ప్రభావితం చేయనున్నాయి. అభ్యర్థుల ఎంపిక కంటే అక్రమాస్తులు, ఓబులాపురం, వివేకా హత్య, మద్యం కేసుల్లో ముందస్తు బెయిళ్లు, కోర్టు మినహాయింపుల సాధనపైనే జగన్ శిబిరం దృష్టి కేంద్రీకరించాల్సి రావడం వారి నిస్సహాయతకు నిదర్శనం. స్థానిక ఎన్నికల వేళ ఈ పరిణామాలు వైసీపీ రాజకీయ వ్యూహాలకు సవాలుగా మారనుంది.

**- నీరుకొండ ప్రసాద్**

## విశాఖకు విమాన సర్వీసుల నిలిపివేత పిల్‌పై జోక్యం చేసుకోలేం

**● సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ వేసిన పిటిషన్‌ను నిరాకరించిన హైకోర్టు**




అమరావతి (చైతన్యరథం): విశాఖ ఎయిర్‌పోర్ట్ సర్వీసుల నిలిపివేతపై హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వాణిజ్య, సివిల్ విమాన కార్యకలాపాలను నిలిపివేస్తూ, వాటిని కొత్తగా వస్తున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి బదిలీ చేస్తూ కేంద్ర సివిల్ ఏవియేషన్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై జోక్యం చేసుకోవడానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. ఈ బదిలీని సవాలు చేస్తూ రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి ఎం.రామారావుతో పాటు మరికొందరు దాఖలు చేసిన పిల్ (పిల్)ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్ లతో కూడిన ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురం – విశాఖల మధ్య ఆరు వరుసల జాతీయ రహదారి పూర్తయ్యే వరకైనా విశాఖ నుంచి డొమెస్టిక్ విమానాలను నడిపేలా ఆదేశించాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని కూడా కోర్టు తిరస్కరించింది. భోగాపురం నుంచి విశాఖపట్నానికి ఆరు వరసల జాతీయ రహదారిని(ఎన్‌హెచ్) పూర్తి చేసే వరకైనా డొమెస్టిక్ విమాన సర్వీసులను విశాఖపట్నం నుంచి నడిపేలా ఆదేశించాలని పిటిషనర్లు చేసిన అభ్యర్థనను సైతం ధర్మాసనం తోసిపుచ్చింది. భోగాపురంలో విమాన రాకపోకల వేళలకు అనుగుణంగా రవాణా సౌకర్యాలను కల్పించినట్లు రాష్ట్ర ప్రభుత్వం పేర్కొందని కోర్టు గమనించింది. ఈ నేపథ్యంలో, ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో తాము జోక్యం చేసుకోలేమని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి లీసా గిల్, న్యాయమూర్తి చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం ఈ విషయాన్ని మౌఖికంగా పేర్కొంది.

**రహదారి పూర్తయ్యే వరకు సేవల కొనసాగింపు :**

విశాఖపట్నంలో కార్యకలాపాలను నిలిపేసి భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నిర్వహించేందుకు వీలు కల్పిస్తూ సివిల్ ఏవియేషన్ మంత్రిత్వశాఖ ఈ ఏడాది జులై 28న జారీచేసిన నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఎం. రామారావు, మరో ఇద్దరు హైకోర్టులో పిల్ వేశారు. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం నామమాత్రంగా ఉందన్నారు. వారి తరపున న్యాయవాది ఠాగూర్ యాదవ్ వాదనలు వినిపిస్తూ, విశాఖపట్నం నుంచి భోగాపురం చేరుకోవడానికి సుమారు రెండు గంటల సమయం పడుతుంది.”విశాఖపట్నం నుంచి దేశీయ విమాన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని, కనీసం ఆరు వరుసల జాతీయ రహదారి ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఈ సేవలను కొనసాగించాలని” వారు కోరారు.

**అరగంటకు ఒక బస్సు సౌకర్యం :**

రాష్ట్రప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపించారు. 2017లో చేసుకున్న ఒప్పందం ప్రకారం భోగాపురం విమానాశ్రయం నుంచి సర్వీసు అందుబాటులోకి వచ్చిన రోజే విశాఖలో విమాన సర్వీసులను నిలిపివేయాల్సి ఉంటుందన్నారు. విమానాల రాకపోకలకు అనుగుణంగా. విశాఖ నుంచి భోగాపురం విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా రోజుకు 80 ట్రిప్పులు ఆర్టీసీ సర్వీసును నడుపుతున్నామన్నారు. ప్రతి అరగంటకు ఓ బస్సుందన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకొని పిల్‌ను కొట్టేయాలని కోరారు.

## వినూత్న వ్యవసాయ పద్ధతుల దిశగా అడుగులు వేయాలి



వీరఘట్టం (చైతన్యరథం): ఇతరులపై ఆధారపడకుండా మహిళా రైతులు వినూత్న వ్యవసాయ పద్ధతుల వైపు అడుగులు వేయాలని రస్తా కుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్త స్రవంతి, జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడీ శారద అన్నారు. మండలంలోని కుమ్మిడి ఇచ్ఛాపురంలో గురువారం నిర్వహించిన మహిళా కిసాన్ దివాస్‌లో వారు పాల్గొన్నారు. పశు పోషణ, కోళ్ల పెంపకం చేపట్టాలని మహిళా రైతులకు సూచించారు. సంప్రదాయ వ్యవసాయ పద్ధతుల నుంచి ఆధునిక, వైవిధ్యమైన సాగుపై దృష్టి పెట్టాలన్నారు. కిచెన్ గార్డెన్లతో కుటుంబ అవసరాలు తీరుతాయని, అదనపు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సౌజన్య, ఉద్యాన శాఖ అధికారిణి సంధ్య, ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సింహాచలం పాల్గొన్నారు.

## రాజీమార్గంలోనే భూ వివాదాలు పరిష్కారం




గూడెం కొత్త వీధి (చైతన్యరథం): గ్రామాల్లో నెలకొంటున్న భూ వివాదాలను సాధ్యమైనంత వరకు రాజీ మార్గంలోనే పరిష్కరించుకోవాలని అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండల తహసీల్దార్ అన్నాజీ రావు అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో మండల స్థాయి భూ వివాదాల పరిష్కార కమిటీ సమావేశం జరిగింది. ఎంపీడీవో రమణబాబు, ఎస్సై సురేష్ తహసీల్దార్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీలో మండలంలో పలు గ్రామాలకు చెందిన భూ వివాదాలపై చర్చించారు. సమస్యను శాంతియుతంగా వివాదరహితంగా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సూచించారు.

## ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో 100 కుటుంబాలు చేరిక



ప్రత్తిపాడు (చైతన్యరథం): ప్రజా సంక్షేమం, అభివృద్ధి పట్ల ఆకర్షితులై వైసీపీకి చెందిన పలువురు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే వరపుల సత్యప్రభరాజా ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. రౌతులపూడిలో పులి మధు ఆధ్వర్యంలో 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం సంతోషంగా ఉందని వరుపుల సత్యప్రభ రాజా అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా తెలుగుదేశం పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నానని తెలిపారు. పార్టీలో చేరిన వారందరికీ టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో రౌతులపూడి మాజీ ఎంపీపీ పులి మేరీ సుజాత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా డీసీసీ బ్యాంకు డైరెక్టర్ పులి మధు, పులి ప్రసాద్, బర్రె రాజేశ్వరరావు, మాదే నూకరాజు, బర్రె రోజా తదితరులు ఉన్నారు.

## పేదలకు కొండంత అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం

**●రూ.2,07,080 విలువైన ఎల్‌ఓసీ చెక్కును అందజేసిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు**




ప్రత్తిపాడు (చైతన్యరథం): గుంటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాకుమాను మండలం, రేటూరు గ్రామానికి చెందిన షేక్ సర్దార్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.2,07,080 విలువైన ఎల్‌ఓసీ చెక్కును నియోజకవర్గ శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న పేదలను కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి, ఎల్‌ఓసీ ద్వారా అర్హులకు వైద్య సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## గొడ్డలి పార్టీ రాజకీయ వేధింపులను మర్చిపోవద్దు : మంత్రి అచ్చెన్నాయుడు

**●దౌర్జన్యాలకు తావులేదు.. ప్రజాస్వామ్యమే మన బాట.. స్థానిక ఎన్నికల్లో విజయమే మన మాట!**



నందిగాం (చైతన్యరథం): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నందిగాం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించి, పార్టీ బలోపేతం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత రాజకీయ పరిణామాలను గుర్తుచేస్తూ, గత ఐదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయని విమర్శించారు. గతంలో ఎదురైన రాజకీయ వేధింపులు, దాడులు, బెదిరింపులను మర్చిపోకుండా, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజల విశ్వాసంతో అన్ని స్థానాల్లో విజయం సాధించేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నందిగాం ప్రాంతంలో సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను వేగవంతం చేశామని, 2027 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రాజెక్టుకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేశామని తెలిపారు. అలాగే, కోటబొమ్మాళిలో పార్టీకి మరింత గౌరవం తెచ్చేలా బ్రహ్మాండమైన మండల పార్టీ కార్యాలయాన్ని నిర్మిస్తామని ప్రకటించారు.

**గొడ్డలి పార్టీ ఐదేళ్ల పాలనలో గ్రామాలు అభివృద్ధికి దూరం**

నందిగాం మండలం విస్తారమైన ప్రాంతమని, అనేక గ్రామాలతో కూడిన ఈ ప్రాంతంలో ప్రజలు ఇప్పటికీ పలు మౌలిక సదుపాయాల సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం, గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడం, అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడంపై దృష్టి సారించాల్సి ఉండగా, గత పాలకులు ప్రజల అవసరాలను విస్మరించారని అన్నారు. గుదేశం పార్టీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని, అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల కోసమే పనిచేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా భావించాలని సూచించారు.

**గొడ్డలి పార్టీ రాజకీయ వేధింపులను మర్చిపోవద్దు**

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి గుర్తుచేశారు. పోలీసు కేసులు, దాడులు, బెదిరింపుల కారణంగా పార్టీ శ్రేణులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ నుంచి తప్పుకునేలా ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ఎన్నికలకు ముందు తనపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించినా వెనక్కి తగ్గలేదని, పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేశానని చెప్పారు.

**స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేద్దాం**

స్థానిక సంస్థల ఎన్నికలు గ్రామీణ ప్రజలకు అత్యంత కీలకమని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ద్వారా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని చెప్పారు. గతంలో స్థానిక ఎన్నికల సమయంలో నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడటం, పోలింగ్ సమయంలో దాడులు చేయడం, ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలు ఉన్నాయని గుర్తుచేశారు. అలాంటి పరిణామాలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.

**వంద శాతం స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యం**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు సహా అన్ని స్థానాల్లో విజయం సాధించే లక్ష్యంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజల ప్రేమ, విశ్వాసాన్ని పొందడం ద్వారానే ఎన్నికల్లో విజయాలు సాధించాలని స్పష్టం చేశారు.

# పోలవరం ప్రాజెక్టులో విదేశీ నిపుణుల బృందం పర్యటన

## 1.5 కి.మీ నడిచి వెళ్లి పనులు పరిశీలన...



పోలవరం (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్టులో కీలకమైన ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణ పనులను అంతర్జాతీయ నిపుణుల బృందం పరిశీలించింది. ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌లోని గ్యాప్-1, గ్యాప్-2 లో జరుగుతున్న పనులను పరిశీలించిన నిపుణులు జీ హిల్ వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు నిర్మాణ పనులను వీక్షించారు. నిర్మాణాల పురోగతిని రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులు, కేంద్ర జల శక్తి శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ అధికారులు నిర్మాణ సంస్థ ప్రతినిధులు వారికి వివరించారు. ప్రాజెక్టును ఈ బృందం సందర్శించడం ఇది ఎనిమిదోసారి. అంతర్జాతీయ నిపుణులు, కేంద్ర జలశక్తి శాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు పోలవరం ప్రాజెక్టులో పర్యటించారు. ఏడుసార్లు ప్రాజెక్టును సందర్శించిన విదేశీ నిపుణుల బృందం మరో విడత కీలకమైన ఎర్త్ కం ర్యాక్ ఫిల్ డ్యామ్ పనుల ప్రగతిని పరిశీలించారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సీఈఓ సంజీవ్ వోహ్రా అధ్యక్షతన తొలుత సమీక్ష సమావేశం నిర్వహించారు. గత పర్యటనలో చేసిన సూచనలు, సలహాల మేరకు చేపట్టిన చర్యలు, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని అధికారులు వారికి వివరించారు.

**నడిచి వెళ్లి పనుల పరిశీలన:**

అంతర్జాతీయ నిపుణులు రిచర్డ్ డొనెల్లీ, గ్యాన్‌ఫ్రాంకో డి సిక్కో, సీన్ హించ్‌బెర్గర్, డేవిడ్ పాల్ పోలవరం ప్రాజెక్టు సందర్శించారు. ఛాయాచిత్రాల ద్వారా పనుల ప్రగతిని అధికారులు వివరించారు. పోలవరం ప్రాజెక్టు సందర్శనలో కొద్దిసేపు వర్షం కురిసింది. దీంతో ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ గ్యాప్ 1, గ్యాప్ -2 నిర్మాణ పనుల్ని 1.5 కి.మీ మేర నడుచుకుంటూ వెళ్లి పనులను పరిశీలించారు. ప్రధానంగా నాణ్యత పనుల ప్రగతిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.

**ఈ నెల 17 వరకు పర్యటన :**

కేంద్ర జలసంఘం డిజైన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ సరబ్జిత్ సింగ్ బక్షి సహ కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర జలవనరుల సంఘం, సి.ఎస్.య, ఎం.ఆర్.ఎస్, వ్యాప్కోస్ అధికారులు పాల్గొన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వర రావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఎస్ ఈ రామచంద్రరావు, నిర్మాణ సంస్థ ఎంఈఐఎల్ జనరల్ మేనేజర్ గంగాధర్ సహా అధికారులు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్ట్‌లో ఈ నెల 17 వరకు విదేశీ నిపుణుల బృందం పర్యటన కొనసాగనుంది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో 100 శాతం విజయమే లక్ష్యం : ఎమ్మెల్యే బొండా ఉమా

**●ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమం, అభివృద్ధిలో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం**

**●అభివృద్ధిని, సంక్షేమాన్ని నమ్మండి.. తెలుగుదేశం పార్టీ కూటమికి అండగా నిలవండి**



విజయవాడ (చైతన్యరథం): సెంట్రల్ నియోజకవర్గంలోని 63వ డివిజన్ అరండల్‌పేట ఉర్దూ హైస్కూల్ వద్ద నుంచి నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వ విప్, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యులు బొండా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రజలను కలుసుకుంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలతో పాటు జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి 100 శాతం విజయాన్ని సాధించడం ఖాయమని బొండా ఉమామహేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు.

**యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి**

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయడం ప్రారంభించామని పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువుల పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచామని, దివ్యాంగుల పింఛన్లను రూ.6,000కు పెంచి వారికి ఆర్థిక భరోసా కల్పించామని తెలిపారు. పేదల కష్టాలను అర్థం చేసుకుని, తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్లు అందించడం ద్వారా ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతటి ప్రాధాన్యత ఇస్తుందో స్పష్టమవుతోందన్నారు.

**ఎన్డీఏ కూటమికి ప్రజలు మద్దతుగా నిలవాలి**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంపై ప్రజలకు నమ్మకం మరింత పెరిగిందని బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తిరిగి వస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ పేదల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. 2019లో ఒక్క అవకాశం ఇవ్వాలని కోరిన వైసీపీకి ప్రజలు అవకాశం ఇచ్చిన తర్వాత రాష్ట్రం ఎదుర్కొన్న పరిణామాలను ప్రజలు గుర్తుంచుకోవాలని, ఈసారి ఎలాంటి రాజకీయ ప్రయోగాలకు తావివ్వకుండా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చే తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమికి ప్రజలు మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

# టెన్నిస్ కోర్టులకు కొత్త కళ.. పికిల్‌బాల్‌కు కొత్త వేదిక క్రీడా

**●రూ.55 లక్షలతో టెన్నిస్ కోర్టుల ఆధునీకరణ : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): నగరాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. నగరంలోని 10వ డివిజన్ వీఎల్ పురంలో ఉన్న టెన్నిస్ కోర్టుల ఆధునీకరణ, డ్రైనేజీ, లైటింగ్ పోల్స్ తదితర మరమ్మతులతో పాటు పికిల్‌బాల్ కోర్టుల నిర్మాణానికి రూ.55 లక్షల వ్యయంతో చేపట్టనున్న పనులకు ఆయన ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రారంభించిన టెన్నిస్ కోర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్న నగర క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కోర్టులను ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రస్తుతం యువతలో ఆదరణ పొందుతున్న పికిల్‌బాల్ క్రీడను ప్రోత్సాహం అందించేందుకు రెండు పికిల్‌బాల్ కోర్టులను కూడా నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. 10వ డివిజన్‌లో ఇప్పటికే సుమారు రూ.42 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

**10 ఎకరాల్లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం**

నగరంలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణానికి మరో కీలక అడుగు పడిందని తెలిపారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కోరిన మేరకు 10 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ టర్మ్‌లోనే స్టేడియం నిర్మాణాన్ని పూర్తి చేసే దిశగా కృషి చేస్తామని, సాధ్యమైనంత త్వరగా భారత జట్టుతో తొలి మ్యాచ్ నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం...

## ఉమ్మడి కార్యాచరణకు ప్రణాళిక

**● రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు**



అమలాపురం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగాలని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు పిలుపునిచ్చారు. అమలాపురంలో నిర్వహించిన అమలాపురం, రామచంద్రాపురం స్థానిక సంస్థల ఎన్నికల సమీక్ష సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి సిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పల్లంరాజుతో కలిసి ఎంపీ పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం నియోజకవర్గం మురమళ్లలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కార్యాలయంలో నిర్వహించిన కూటమి సమన్వయ కమిటీ సమావేశంలో నియోజకవర్గ అబ్జర్వర్ సుంకర పావని, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, టీడీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు గుత్తుల సాయితో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహాలు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యాచరణ, కూటమి పార్టీల మధ్య సమన్వయంపై విస్తృతంగా చర్చించారు. నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ స్థానిక సంస్థల్లో విజయాలు, ఏకగ్రీవ ఫలితాలు సాధించే దిశగా కృషి చేయాలని ఎంపీ పిలుపునిచ్చారు.

# అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారు

**●100% స్ట్రైక్ రేట్‌తో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్న మాజీ మంత్రి**



నిడదవోలు (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమమే అజెండాగా స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించబోతున్నారని మాజీ మంత్రి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నాయకత్వం కార్యాచరణకు సిద్ధమవుతోందని తెలిపారు. నిడదవోలులో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమై ఎన్నికల సన్నద్ధతపై విస్తృతంగా చర్చించారు. నిడదవోలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బూరుగుపల్లి శేషారావు, తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరితో కలిసి పార్టీ ముఖ్య నేతలతో భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఈ సమావేశంలో జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం, క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయంతో ముందుకు నడిపించడం, ప్రజల్లో పార్టీకి మరింత చేరువ కావడానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ప్రధానంగా చర్చించారు. 100% స్ట్రైక్ రేట్‌తో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పటిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని మరింత పెంపొందించుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సమష్టి కృషి, పటిష్టమైన వ్యూహంతో ముందుకు సాగడం కీలకమని, నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తూ పార్టీ విజయానికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఈ భేటీలో ప్రస్తావించారు.

# హజ్-2027 మెహ్రామ్ కోటా కింద 29 దరఖాస్తులు..

## 18 మంది యాత్రికుల ఎంపిక



విజయవాడ (చైతన్యరథం): హజ్-2027 యాత్రకు సంబంధించి మెహ్రామ్ కోటా కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అందిన 29 దరఖాస్తుల్లో 18 మంది యాత్రికులు ఎంపికయ్యారని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా, ముంబై వారు 14.10.2026న జారీ చేసిన సర్క్యులర్ నం. 17 ప్రకారం నిర్వహించిన డిజిటల్ రాండమ్ ఎంపిక (ఖుర్రా) ప్రక్రియలో ఈ ఎంపిక జరిగింది. ఎంపికైన 18 మంది యాత్రికులు ఈ నెల 30వ తేదీలోగా మొదటి విడత హజ్ యాత్ర చెల్లింపు రూ.1,52,300ను బ్యాంకు ద్వారా లేదా ఆన్లైన్ ద్వారా జమ చేయాలి. అలాగే, చెల్లింపు రసీదు, సంబంధిత దరఖాస్తు పత్రం, ప్రాథమిక వైద్య పరీక్ష నివేదిక మరియు మెడికల్ ఫిట్నెస్ సర్టిఫికేట్తో సహా అవసరమైన పత్రాలను 02.11.2026వ తేదీలోగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీకి సమర్పించాలి. ఎంపికైన యాత్రికులు నిర్ణీత గడువులోగా చెల్లింపులు పూర్తి చేసి, అవసరమైన పత్రాలను సమర్పించి హజ్ యాత్రకు సంబంధించిన తదుపరి ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని చైర్మన్ షేక్ హసన్ బాషా కోరారు.

## భారతరత్న అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం : మాజీమంత్రి దేవినేని ఉమా



విజయవాడ (చైతన్యరథం): భారతదేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ దేశాల సరసన నిలిపిన గొప్ప దార్శనికుడు, భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు కొనియాడారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుని దేశసేవలను స్మరించుకుంటూ గొల్లపూడిలోని కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్షిపణి శాస్త్రవేత్తగా దేశ రక్షణ రంగానికి విశేష సేవలందించి, భారతదేశ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి కలాం అని పేర్కొన్నారు. శాస్త్రవేత్తగా ఎన్నో విజయాలు సాధించడంతో పాటు, భారత రాష్ట్రపతిగా ప్రజలకు చేరువై 'ప్రజల రాష్ట్రపతి'గా విశేష గుర్తింపు పొందారని తెలిపారు. కలలు కనడమే కాదు.. వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని యువతకు సందేశమిచ్చిన మహనీయుడు అబ్దుల్ కలాం. విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, దేశభక్తి, నిస్వార్థ సేవ పట్ల ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఉమా పేర్కొన్నారు. యువతే దేశ భవిష్యత్తు అని బలంగా విశ్వసించిన కలాం, విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు. ఆయన ఆలోచనలు, ఆశయాలు నేటి తరానికి దిశానిర్దేశం చేస్తాయని తెలిపారు. అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, సామాజిక సేవ రంగాల్లో యువత ముందుకు సాగాలని, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆ మహనీయుని జీవితం, సేవలు, స్ఫూర్తి తరతరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలు రద్దు

● నేడు మూల నక్షత్రం నేపథ్యంలో దుర్గమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించనున్న సీఎం దంపతులు ... వెల్లడించిన ఈవో శీనా నాయక్



విజయవాడ (చైతన్యరథం): మూల నక్షత్రం నేపథ్యంలో సరస్వతీ దేవి అలంకారంలో శుక్రవారం దుర్గమ్మ వారు భక్తులకు దర్శనం ఇస్తారని శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ఈవో శీనా నాయక్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీఐపీ ప్రోటోకాల్ దర్శనాలు రద్దు చేసినట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య అమ్మవారికి సీఎం చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని చెప్పారు. గురువారం అర్ధరాత్రి 12.30 – 12.45 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పిస్తామని అన్నారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. ఇంద్రకీలాద్రిపై వైభవంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఐదో రోజు లలిత త్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారని పేర్కొన్నారు. గురువారం ఉదయం నుంచే ఇంద్రకీలాద్రికి భక్తులు భారీగా పోటెత్తారని వివరించారు. నవరాత్రులు ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 7 లక్షల మంది భక్తులు దుర్గమ్మవారిని దర్శించుకున్నారని అన్నారు. అమ్మవారి దర్శనం కోసం వచ్చే సామాన్య భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. క్యూ లైన్లు, మూడు హోల్డింగ్ ఏరియాల్లో సుమారు 30 వేల మంది భక్తులు వేచి ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 72 వేల మంది భక్తులు అన్నప్రసాద వితరణ స్వీకరించారని వివరించారు. 8.70 లక్షల లడ్డూ ప్రసాదాలు కొనుగోలు జరిగాయని పేర్కొన్నారు. అయితే ఘాట్ రోడ్డుపై ఫోర్ వీలర్ వాహనాలకు అనుమతి లేదని వాహనదారులకు స్పష్టం చేశారు. క్యూ లైన్లు, హోల్డింగ్ ఏరియాల్లో మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, ఆహారం పంపిణీ చేస్తున్నామని వివరించారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఈ ఉత్సవాల విజయవంతానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ఈవో శీనా నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

## నా వెనుక ఒకాయన ఉన్నాడు.. ఆయనకు ఒక కొడుకు ఉన్నాడు.. లెక్కలు బాగా సరిచేస్తాడు

●ఒక్కసారి టచ్ చేస్తేనే ఈ నియోజకవర్గంలో నాయకులందరూ పారిపోయారు..

●ఓడిపోయినా మళ్లీ గన్నవరం వచ్చి గెలిచా... పారిపోయానని ఎలా అంటావ్ ? : యార్లగడ్డ వెంకట్రావు మండిపాటు



గన్నవరం (చైతన్యరథం): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై గన్నవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నియోజకవర్గం నుంచి తాను పారిపోయానంటూ వంశీ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నిడమానూరు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తాను ఓడిపోయినా మళ్లీ గన్నవరం వచ్చి పోటీ చేసి విజయం సాధించానని అన్నారు. 2009లో గన్నవరం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయాలని కోరుకున్న వంశీకి టికెట్ దక్కకపోవడంతో విజయవాడ వెళ్లి పార్లమెంట్‌కి పోటీ చేశాడని విమర్శించారు. అలాంటిది అతను తనను పారిపోయానని ఎలా అంటారని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాల్లో వంశీతో కలిసి పనిచేయాలని అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు సూచించారని వెంకట్రావు తెలిపారు. అయితే, వంశీతో కలిసి పనిచేయలేనని తాను ఖరాఖండిగా చెప్పినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలతో తనకున్న అనుబంధాన్ని ఎవరూ విడదీయలేరని స్పష్టం చేశారు. తన తల్లిదండ్రులు మంచి సంస్కారం నేర్పించారని, తాను ఎప్పుడూ ఎవరినీ అసభ్య పదజాలంతో దూషించలేదని చెప్పారు. దుట్టా రామచంద్రరావుపై గతంలో వంశీ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తూ, తనపై విమర్శలు చేసే ముందు తన గతాన్ని కూడా గుర్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సమయంలో ఎవరు అందుబాటులో ఉన్నారో ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. తాను ఎప్పుడూ గన్నవరం ప్రజలకు దూరంగా లేనని స్పష్టం చేశారు.

### జగన్‌పై వంశీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేయలేదా?

2019 ఎన్నికల్లో జగన్ తన వెనుక ఉన్నారని, 2024 ఎన్నికల్లో వంశీ వెనుక ఉన్నారని వెంకట్రావు.... అయితే, 2019 ఎన్నికల్లో వంశీపై జగన్ చేసిన విమర్శల తరహాలో 2024 ఎన్నికల్లో తన గురించి మాట్లాడలేదన్నారు. తాను పార్టీ మారిన తర్వాత జగన్‌ను దూషించలేదని, వంశీ మాత్రం జగన్‌తో పాటు ఆయన సతీమణి, చంద్రబాబునాయుడు, ఆయన సతీమణిపై గతంలో అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. 2019లో తన వెనుక ఉన్న జగన్ 2024లో వంశీ వెనుక ఉన్నారని, 2029లో కూడా వంశీ వెనుకే ఉంటారో లేక కొత్త అభ్యర్థిని ప్రకటిస్తారో చూసుకోవాలని వెంకట్రావు అన్నారు.

### నాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు పెట్టింది మీరు కాదా?

గన్నవరంలో అక్రమ మైనింగ్, అక్రమ లేఅవుట్లు, భూ సెటిల్‌మెంట్లు, మైనింగ్ మాఫియాకు సంబంధించిన వ్యవహారాలపై విచారణ జరిగిందని పేర్కొన్నారు. వందల కోట్ల రూపాయల అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై విచారణలో వాస్తవాలు తేలుతాయని చెప్పారు. గతంలో జగన్ సైతం బ్రహ్మలింగయ్య చెరువు వ్యవహారంపై వంశీని విమర్శించిన వీడియోలను ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో ఉన్నాయని చెప్పారు. గూడవల్లి నరసయ్య ఇంటిపై దాడి చేసింది ఎవరు? రంగబాబు కాళ్లు విరగ్గొట్టింది ఎవరు? అని వెంకట్రావు ప్రశ్నించారు. కార్యకర్తలపై, డాక్టర్ దుట్టా రామచంద్రరావుపై, తనపై నమోదైన కేసులన్నీ అక్రమ కేసులా సక్రమ కేసులా అని నిలదీశారు. తాను నిడమానూరులో లోకేశ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిన తర్వాత రంగన్నగూడెం వరకు వెళ్లే 48 గంటల లోపే తనపై కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు కూడా పెట్టారని అన్నారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత వైకాపా కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టబోనని ఎన్నికల సమయంలోనే స్పష్టంగా చెప్పానని వెంకట్రావు గుర్తుచేశారు.

### స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి

తెలుగుదేశం, జనసేన, భాజపా కలిసి నియోజకవర్గంలో మరింత బలంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి తరపున వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని, గన్నవరం నియోజకవర్గంలో కూటమి జెండా ఎగరేయడమే లక్ష్యమని తెలిపారు. ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో తాను బిజీగా ఉన్నానని, ప్రస్తుతం ప్రజలకు మరింత సమయం కేటాయించగలనని వెంకట్రావు అన్నారు.

## సాంకేతిక విప్లవ సారథి అబ్దుల్ కలాం... యువతకు ఆదర్శం కలాం జీవితం

● మిస్సైల్ మ్యాన్ ఆశయాల సాధనకు కూటమి ప్రభుత్వం కృషి

●కలాంకు నివాళులర్పించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): దేశ చరిత్రలోనే అత్యంత మహోన్నతమైన, కోట్లాది మంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఒక మహానాయకుడు భారతరత్న అబ్దుల్ కలాం అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురువారం స్థానిక తూర్పు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం పేదరికం నుండి విజ్ఞాన శిఖరాల వరకు తన జీవితాన్ని మలుచుకున్నారని తెలిపారు. చిన్నతనంలో కుటుంబానికి ఆసరాగా ఉండటానికి ఉదయాన్నే పేపర్ బాయ్‌గా కూడా పని చేశారని చెప్పారు. ఆశయం ఉంటే జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు పేదరికం అడ్డుకాకూడదని నిరూపించారన్నారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసిన కలాం భారత క్షిపణి పితామహుడిగా గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ వాహక నౌక ఎస్ఎల్వీ–3 రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. అగ్ని, పృథ్వీ వంటి శక్తివంతమైన క్షిపణులను తయారు చేసి భారత్‌ను రక్షణ రంగంలో ప్రపంచ దేశాల సరసన అగ్రస్థానంలో నిలబెట్టారని చెప్పారు. భారత రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించిన కలాం రాష్ట్రపతి భవన్ తలుపులను సామాన్య ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచారన్నారు. అందుకే ఆయనను అందరూ ప్రజా రాష్ట్రపతిగా పిలుచుకునే వారని చెప్పారు. దేశానికి నిజమైన ఆస్తి యువతచ విద్యార్థులేనని చెప్పే వారన్నారు. సూర్యుడిలా ప్రకాశించాలంటే, ముందు సూర్యుడిలా మండడం నేర్చుకోవాలని పిలుపునిచ్చారన్నారు.

## దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం... అందజేసిన భక్తుడు



విజయవాడ (చైతన్యరథం): కనకదుర్గమ్మకు భక్తులు తరచూ వివిధ రకాల విలువైన బంగారు కానుకలను సమర్పించి తమ భక్తిని చాటుకుంటారు. తాజాగా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి స్వర్ణ కిరీటం కానుకగా అందింది. దాదాపు రూ.75 లక్షలు విలువైన స్వర్ణ కిరీటాన్ని దాతలు బహూకరించారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దాతలు 494 గ్రాముల బంగారు కిరీటాన్ని దుర్గమ్మకు కానుకగా సమర్పించారు. కూర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడు కె.దుర్గా శ్రీనివాస్ స్వర్ణ కానుక అందించారు. ఎరుపు, నీలం, తెలుపు, పచ్చ రాళ్లతో నవరత్న ఖచిత కిరీటాన్ని రూపకల్పన చేశారు. గురువారం స్వర్ణ కిరీటాన్ని ఆలయ ఈవో వీకే శీనా నాయక్, చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ వి.త్రినాథరావుకు దాతలు అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి అమ్మవారి అంతరాలయంలో ప్రత్యేక దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేయడంతో పాటు.. శేషవస్త్రం, ప్రసాదాలతో దాతలను అధికారులు సత్కరించారు. అమ్మవారి దయతోనే స్వర్ణ కిరీటాన్ని సమర్పించుకోగలిగామని దాత దుర్గా శ్రీనివాస్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ అలంకారాల్లో దర్శనమిస్తున్న దుర్గమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. ఉత్సవాల్లో ఐదోరోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

# ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్

తిరుపతి (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలతో ఎన్నికల కోడ్ బుధవారం నుంచి అమల్లోకి వచ్చిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు నియమావళి అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని మీటింగు హాలులో బుధవారం రాత్రి ఆయన జిల్లా ఎన్నికల అధికారి హోదాలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం స్థానిక ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ తుషార్ డూడీతో కలిసి సుమిత్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. 'కోడ్ అమల్లోకి రావడంతో ఎన్నికల వి?ధుల్లోని అధికారులు, సిబ్బంది ఎన్నికల సంఘం పరిధిలోకి వచ్చారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్.. నెంబరు 18004254901 ను ఏర్పాటు చేశాం. ఎన్నికల నిర్వహణలో సుమారు 10వేల మంది సిబ్బంది పాల్గొంటారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో 13.06 లక్షల మంది ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశాలు జారీచేశాం. రాజ్యాంగబద్ధమైన నిబంధనలకు అనుగుణంగా స్థానిక ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాం. 2026 జనవరి ఒకటి నాటి ఓటరు జాబితాను తీసుకుని ఎన్నికలను నిర్వహిస్తున్నాం. నామినేషన్ల స్వీకరణ చివరి నాటి వరకు కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చు' అని కలెక్టర్ సుమిత్‌కుమార్ వివరించారు. స్థానిక ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశమున్న 779 మందిని గుర్తించి.. కొంత మందిపై బైండోవర్ కేసులు పెట్టామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. 'పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాం. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం, నగదు పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు, అనధికారికంగా ఆయుధాల వినియోగం వంటి వాటిని అరికట్టేందుకు కార్డన్‌సెర్చ్ కార్యక్రమాలను నిర్వహిస్తాం. సున్నిత, అతిసున్నిత ప్రాంతాలను గుర్తించాం. పొరుగు రాష్ట్రాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేస్తాం. నగదు, మద్యం రవాణాల, ఇతర ప్రాంతాల నుంచి ప్రచారాల కోసం వచ్చే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాం. సీసీ టీవీలు, డ్రోన్లు, స్థిర, తాత్కాలిక చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు చేస్తాం. సోషల్ మీడియాలో కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు, ఓటర్లను బెదిరించడం వంటి చర్యలకు పాల్పడిన చర్యలు తప్పవు' అని హెచ్చరించారు. సోషల్ మీడియా కలాపాలపై 24 గంటల పర్యవేక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో సమన్వయంతో పని చేయాలి

## దోర్నాల కూటమి నాయకులకు ఎరిక్సన్ బాబు పిలుపు

యర్రగొండపాలెం (చైతన్యరథం): దోర్నాల పట్టణంలోని శివ సదనంలో నిర్వహించిన దోర్నాల మండల కూటమి నాయకుల సర్వసభ్య సమావేశంలో యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, కూటమి ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ మాబు, మండల కూటమి నాయకులు, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుప్పంలో వైసీపీ ఖాళీ

## భారీగా కూటమిలో చేరుతున్న నాయకులు, కార్యకర్తలు




కుప్పం (చైతన్యరథం): చిత్తూరు జిల్లాలోని కుప్పంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి పెద్ద సంఖ్యలో శ్రేణులు బై బై చెప్పి.. టీడీపీ కుండువా కప్పుకున్నాయి. గురువారం అధికార పార్టీ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో ఆయా శ్రేణులు టీడీపీలో చేరాయి. కుప్పం మున్సిపల్ వైస్ చైర్మన్ మునుస్వామి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విద్యాసాగర్ తన అనుచరులతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కుండవా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధి చూసి ఆయనతో కలిసి నడిచేందుకు టీడీపీలో చేరుతున్నట్టు ఈ సందర్భంగా వారు వెల్లడించారు. కుప్పం అభివృద్ధి సీఎం చంద్రబాబుతో సాధ్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. గతంలో ప్రలోభాలకు గురి చేసిన వైసీపీ పూర్తిగా ఖాళీ కావడం తథ్యమని జోస్యం చెప్పారు. వైసీపీలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం నుంచి రాయలసీమలోని అనంతపురం జిల్లాల వరకు ఆ పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. తాజాగా కుప్పంలోని వైసీపీ నేతలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. ఆ ఎన్నికల్లో కూటమిలోని పార్టీలు సీట్ల సర్దుబాటుపై చర్చిస్తున్నాయి. అవి మరికొన్ని గంటల్లో కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఇక విజయనగరం జడ్పీ చైర్మన్, బొత్స సత్యనారాయణ సమీప బంధువు మజ్జి శ్రీను అలియాస్ చిన్న శ్రీను ఇటీవల వైసీపీ వీడారు. అనంతరం టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. జిల్లాలోని ఆయన ప్రధాన అనుచరులు కూడా టీడీపీలో చేరిపోయారు. దీంతో జిల్లాలో వైసీపీ పూర్తిగా ఖాళీ అయిపోయిందనే ఓ చర్చ సాగుతోంది. అలాగే అనకాపల్లి, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, పల్నాడు తదితర జిల్లాల్లో కూడా వైసీపీ వీడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది.



# నిరాడంబరంగా ఎంపీ మాగుంట జన్మదిన వేడుకలు

ఒంగోలు (చైతన్యరథం): రాంనగర్ 2 వ లైనులోని మాగుంట కార్యాలయంలో మాగుంట అభిమానులు ఎంపీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాగుంట అభిమానులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట రాఘవ రెడ్డి, మాగుంట నిఖిల్ బాబు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, కనిగిరి శాసనసభ్యుడు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు, సంతనూతలపాడు శాసనసభ్యుడు విజయ్ కుమార్, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు, సిద్దా సుధీర్, తాతా ప్రసాద్, కుప్పా రంగసాయి, అయినాబత్తిన ఘనశ్యామ్, ఆత్మకూరి బ్రహ్మయ్య, బెల్లం సత్యనారాయణ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం

## పాల్గొన్న రాష్ట్ర ఐడీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని

ఏలూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో దెందులూరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ సూచనల మేరకు నియోజకవర్గ పరిధిలోని ఏలూరు రూరల్ మండల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో రాష్ట్ర ఇరిగేషన్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దెందులూరు నియోజకవర్గ పరిశీలకురాలు అంకెం ఇందిరా ప్రియదర్శిని ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల సీనియర్ నాయకులు, బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జీలతో ఎన్నికల సంఘం ప్రకటించిన రిజర్వేషన్ ప్రకారం ఆయా స్థానాలకు పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను అందజేయాలని, అందరూ సమష్టిగా నిర్ణయించుకుని అందజేస్తే పార్టీ అధిష్టానానికి అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తల నుంచి పలు అభిప్రాయాలు, సలహాలు, సూచనలు కోరారు, శాసనసభ్యుడు చింతమనేని ప్రభాకర్ సూచనలు, నాయకత్వంలో అందరం కలిసి పనిచేసి కూటమి అభివృద్ధికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు.



భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా అమరావతి గ్రౌండ్స్ లో యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబుతో కలసి నివాళులర్పించిన ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, పాల్గొన్న నాయకులు

# మైనారిటీలకే మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి

## కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి: మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): పెనుకొండలోని మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో మైనారిటీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సవిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులకే కౌన్సిలర్ టికెట్లు కేటాయిస్తామని తెలిపారు. ముస్లిం మైనారిటీలకు ఐదు కౌన్సిలర్ స్థానాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వంలో మైనారిటీలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తున్నామని, మున్సిపల్ వైస్ చైర్మన్ పదవిని కూడా మైనారిటీలకే కేటాయిస్తామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మంత్రి పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు విభేదాలకు తావివ్వకుండా ఐక్యంగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవితో పాటు మొత్తం 23 వార్డుల్లోనూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి సవిత కోరారు. ఈ సమావేశంలో పెనుకొండ పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పకడ్బందీగా స్థానిక ఎన్నికల నిర్వహణ

## పోలీసు యంత్రాంగానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆదోని (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఆదోనిలో మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదోని ఏఎస్పీ జయశర్మ, మున్సిపల్ కమిషనర్ నయూమ్ అహమ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రతా ఏర్పాట్లు, ఈవీఎంలు లేదా బ్యాలెట్ బాక్సుల భద్రత, సీసీ కెమెరాల ఏర్పాటు తీరు తెన్నులను అధికారులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి చిన్నపాటి లోపాలు లేదా సంఘటనలు కూడా తలెత్తకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్, రామలింగమయ్య, నల్లప్ప, గౌస్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామగ్రామానా కూటమి జెండా ఎగరాల్సిందే

## ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి




మడకశిర (చైతన్యరథం): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించడమే లక్ష్యంగా మడకశిర ఎమ్మెల్యే కార్యాలయంలో ఐదు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలతో కీలక సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, పరిశీలకులు (అబ్జర్వర్) యనమల సుధాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా లీగల్ సెల్ సెక్రెటరీ రాధాకృష్ణప్ప ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు. అలాగే అన్ని మండలాల కన్వీనర్లు, సింగిల్ విండో అధ్యక్షులు, మాజీ జెడ్పీటీసీలు, క్లస్టర్, కో, క్లస్టర్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, కూటమి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో ప్రతి పంచాయతీలోనూ కూటమి పార్టీ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా అందరూ ఐక్యంగా పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు.

కార్యకర్తలకు భరోసా: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూసుకుంటామని భరోసా కల్పించారు. క్షేత్రస్థాయిలో పట్టున్న సమర్థులైన అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలపాలని నాయకులకు స్పష్టమైన సూచనలు చేశారు.

# గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా రాయలసీమ

## అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్



అనంతపురం (చైతన్యరథం): రాయలసీమ ప్రాంతాన్ని రూ.లక్ష కోట్లతో గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చబోతున్నామని దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 40వేల కోట్లు, కేంద్ర ప్రభుత్వం పీపీపీ మోడల్‌లో మరో రూ. 60వేల కోట్లు తీసుకురావడం జరుగుతోందన్నారు. మదనపల్లిలో రిలయన్స్ భాగస్వామ్యంతో ప్రతిష్ఠాత్మక హార్టీకల్చర్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు ఒక్క డ్రిప్ లేదా స్ప్రింక్లర్ కూడా ఇవ్వలేదని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 300 కోట్లతో డ్రిప్పులు, స్ప్రింకర్లను రైతులకు అందించామన్నారు. రాయలసీమ ప్రాంతానికి గతంలో ఎప్పుడూ లేని విధంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు. చిత్తూరు జిల్లాకు ప్రసిద్ధ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఫ్యాక్టరీని తీసుకొచ్చామన్నారు. అలాగే వేల కోట్ల పెట్టుబడులతో విండ్, సోలార్ పవర్ ప్రాజెక్టులు వస్తున్నాయన్నారు. పుట్టపర్తికి యుద్ధ విమానాలు తయారు చేసే డిఫెన్స్ పరిశ్రమను తీసుకొచ్చామన్నారు. అనంతపురం జిల్లాలో రూ. లక్ష కోట్ల పెట్టుబడులతో భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించబోతున్నారన్నారు. గతంలో సీఎం చంద్రబాబు కియా మోటార్స్ తెచ్చి 50వేల మందికి ఉద్యోగ,ఉపాధి కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 2వేలకోట్లకు పైగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఈ రెండేళ్లలో చేశామని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. మౌలిక వసతుల కోసం రూ. 300 కోట్లు ఖర్చు చేశామని... మేము చేసిన అభివృద్ధి వల్లే నేడు రాంనగర్ ప్రాంతంలో సెంట్ భూమి విలువ రూ. 20 లక్షల నుండి రూ. 40 లక్షలకు చేరిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో డంపింగ్ యార్డ్ పేరుతో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని విమర్శలు చేశారు. మేము అధికారంలోకి వచ్చిన వెంటనే చెత్తను పూర్తి స్థాయిలో తొలగించే ప్రక్రియ ప్రారంభించామన్నారు. ఇప్పటికే 75 శాతం పనులను పూర్తయ్యాయని.. మిగిలిన 25 శాతం పనులను రాబోయే రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు. వచ్చే మూడు నెలల్లో ఇక్కడ సరికొత్త ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ తీసుకురాబోతున్నామని.. మిగిలిన స్థలంలో ప్రజల కోసం అందమైన పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. గత నెలలోనే అమృత్-2 ద్వారా రూ. 107 కోట్లతో నియోజకవర్గంలో ఇంటింటికీ కొళాయి ఏర్పాటు చేయబోతున్నామని.. రూ. 50 కోట్లతో నగరంలో పార్కులు, డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. వీటితో పాటు అదనంగా మరో రూ. 160 కోట్లతో అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థను నిర్మించబోతున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# అభివృద్ధి ఎవరు చేశారో ప్రజలే చెబుతారు

## ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



ఆళ్లగడ్డ (చైతన్యరథం): అభివృద్ధి ఎవరు చేశారో ప్రజలే నిర్ణయించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. బుధవారం టిట్కో గృహాల్లో రూ.2.31 కోట్లతో నిర్మించిన 11 కేవి విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రభు త్వ ఆసుపత్రిలో ఓపీ బ్లాక్, పడకండ్ల గ్రామం లో రూ.75 లక్షలతో నిర్మించిన మురుగు కాలువను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఐదేళ్ల పాలనలో ఆళ్లగడ్డ ప్రజలకు ఏమీ చేయని వైసీపీ నాయకులు ఏ ముఖం పెట్టుకొని ప్రజల వద్దకు విమర్శించారు. బత్తలూరు గ్రామంలో మురుగు ఇళ్లవద్ద ఉండేదని, మంత్రి నారాయణతో మాట్లాడి డ్రైనేజీ నిర్మించామన్నారు మొలకల వాగుకు గతంలో డ్రైయిన్ నిర్మించామని, రామలక్ష్మి కొట్టాల, నాలుగు రోడ్ల సర్కిల్, పడకండ్ల కాలనీల్లో ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. మున్సిపాలిటీకి టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన రూ.21 కోట్లతో పాటు, మరో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే వివరించారు. టీడీపీ పరిశీలకుడు దేవల్ల మురళి, మాజీ కౌన్సిలర్ హుసేన్‌బాషా, సుధాకర్‌రెడ్డి, నాగేంద్ర, విష్ణువర్దన్‌రెడ్డి ఉన్నారు.

### శిరివెళ్ల టీడీపీకి కంచుకోట

శిరివెళ్ల: తెలుగుదేశం పార్టీకి శిరివెళ్ల కంచుకోట అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. గ్రామానికి చెందిన మౌలా కరీం, బిలాల్, అబూబకర్, మౌలా ఇమ్రాన్, షేర్, ఫరీద్‌బాబు, వహీద్‌బాబు, హఫీజ్, బురా అస్లాం, బురా బిలాల్ తదితర 40 కుటుంబాలు వైసీపీని వీడి ఎమ్మెల్యే సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ యామా గుర్రప్ప, సూరా రామ, బీసీ ఖాజాహుసేన్, ఫిదాహుసేన్, యామా శ్రీనివాసులు, శ్రీకాంత్, ఉల్లి సుబ్బయ్య, జిక్రియా, సూరా శ్రీనివాసులు, సిద్దిఖ్, కరీం పాల్గొన్నారు.

ఇండో-అమెరికన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నేటి నుంచి

# అంతర్జాతీయ మీడియా సదస్సు

**ఒహియో (అమెరికా):** ఇండో–అమెరికన్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో 11వ వార్షిక అంతర్జాతీయ మీడియా సదస్సు ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు వైభవంగా జరగనుంది. ఒహియోలోని 'డెల్టా హోటల్స్ బై మారియట్ సిన్సినాటి షారన్‌విల్లే' వేదికగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులు, రచయితలు, దాతృత్వవేత్తలు, మీడియా ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు ఒకే వేదికపైకి రానున్నారు.

**ముఖ్యాంశాలు, చర్చనీయాంశాలు:**

ఈ అంతర్జాతీయ సమావేశంలో జర్నలిజం మూలాలు, మీడియా ఆవిష్కరణలు, కృత్రిమ మేధస్సు (ఏఐ) వాడకం, మోరల్ రిపోర్టింగ్, రిపోర్టింగ్‌లో ఎన్ఆర్ఐల భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. ప్రజా సేవ, సామాజిక నాయకత్వం, సాహిత్యం, ఆరోగ్యం, దాతృత్వం, వ్యాపారం తదితర రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖులను గుర్తించి సత్కరించేందుకు ప్రతిష్టాత్మక 'IAPC అవార్డ్స్ గాలా' నిర్వహించనున్నారు.

**హాజరుకానున్న ప్రముఖులు:**




గ్రెగ్ లాండ్స్‌మన్ (అమెరికా కాంగ్రెస్ సభ్యుడు)
అఫ్తాబ్ పురేవాల్ (సిన్సినాటి నగర మేయర్)
నీరజ్ అంటాని (ఒహియో అసెంబ్లీ మాజీ సభ్యుడు)
మాథ్యూ షావ్యూల్ (అంతర్జాతీయ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్)
మీరా నాయర్ (ప్రసిద్ధ నటి)

వీరితో పాటు ఉత్తర అమెరికా, భారతదేశం, యూరప్, మధ్య ప్రాచ్య దేశాలకు చెందిన ప్రముఖ జర్నలిస్టులు, ప్రచురణకర్తలు, సంపాదకులు, మీడియా నిపుణులు విలక్షణ చర్చల్లో పాల్గొంటారు.

ఐఏపీసీ పురస్కార విజేతలు: వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు ఈ వేదికపై పురస్కారాలు అందజేయనున్నారు.

**లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు:** డాక్టర్ మెహర్ మేడవరం, డాక్టర్ వీకే రాజు, రోయ్ రత్నవేల్, ముత్తు ముదలియార్, డాక్టర్ టీఎస్ వినీత్ భట్, డాక్టర్ సుభాష్ రజ్దాన్

**ఇతర ప్రత్యేక పురస్కారాలు:**

వుమెన్ ఎంపవర్‌మెంట్–సాహిత్య ఎక్సలెన్స్ అవార్డు: డాక్టర్ సునీతా రెడ్డి
కమ్యూనిటీ సర్వీస్ అవార్డులు: డాక్టర్ సునీత పొలేపల్లి, జై బేడీ, ప్రమోద్ జవేరీ
మోస్ట్ ఇంపాక్ట్‌ఫుల్ బుక్ ఆన్ సౌత్ ఏషియన్స్ అవార్డు: డాక్టర్ ముబీన్ సయ్యద్
కర్మశ్రేష్ఠ అవార్డు: సాజన్ వర్గీస్
ఎక్సలెన్స్ ఇన్ లీడర్‌షిప్ అవార్డు: డాక్టర్ సుజీత్ పున్నం

జర్నలిజంలో నైతిక విలువలను పెంపొందించడం, మీడియా నిపుణుల ద్వారా ప్రపంచ దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమని IAPC చైర్మన్ డాక్టర్ సతీష్ కతుల తెలిపారు.

శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో వైభవంగా

# దృష్టి కోసం సంగీత, నృత్య మహోత్సవం

**ఆర్కాన్సాస్‌లో కంటి వెలుగుల నిధుల సేకరణ కార్యక్రమం విజయవంతం... 'అడాప్ట్ ఎ విలేజ్' పథకానికి తొలి దాతగా బాపూజీ వక్కలగడ్డ**



**బెంటన్‌విల్ (అమెరికా):** పేదలకు ఉచితంగా కంటి వైద్య సేవలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపే దివ్య సంకల్పంతో శంకర నేత్రాలయ యూఎస్ఏ (ఆర్కాన్సాస్ విభాగం) ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి నిధుల సేకరణ కార్యక్రమం 'మ్యూజిక్ అండ్ డాన్స్ ఫర్ విజన్–2026' అత్యంత వైభవంగా జరిగింది. బెంటన్‌విల్‌లోని 'ది నైబర్‌హుడ్ చర్చి' వేదికగా జరిగిన ఈ వేడుకకు దాదాపు 150 మందికి పైగా ప్రవాస భారతీయులు హాజరయ్యారు.

సంగీత, నృత్య ప్రదర్శనలతో ఆహ్లాదకరంగా సాగిన ఈ వేడుక, చూపు లేని నిరుపేదలకు సహాయం చేయాలనే సేవా సంకల్పానికి చక్కని వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమాన్ని ఆర్కాన్సాస్ విభాగం ఉపాధ్యక్షుడు వైద్యనాథన్ వెంకటసుబ్రమణియన్ ప్రారంభించారు. శంకర నేత్రాలయ లక్ష్యాలను, ఉచిత కంటి వైద్య సేవల ప్రాముఖ్యతను, యూఎస్ఏ విభాగం ద్వారా చేపడుతున్న వివిధ సేవా కార్యక్రమాలను ఆయన వివరించారు.

శివాలయ డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు, స్థానిక సాంస్కృతిక బృందాలు ప్రదర్శించిన భారతీయ శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ఎస్ఎస్ఎస్ మ్యూజిక్ బృందం నిర్వహించిన లలిత సంగీత కార్యక్రమం ఆహూతులను అలరించింది. గాయకులు సుమంగళి, రాము తమ గానామృతంతో మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. నృత్య ప్రదర్శనల్లో పాల్గొన్న కళాకారులకు పతకాలు అందజేశారు. వారికి శిక్షణనిచ్చిన గురువులను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఈ వేడుకలో మరొక ముఖ్య ఘట్టం చోటుచేసుకుంది. శంకర నేత్రాలయ ప్రవేశపెట్టిన 'అడాప్ట్ ఎ విలేజ్' (గ్రామ దత్తత) కార్యక్రమానికి ఆర్కాన్సాస్ రాష్ట్రం నుంచి తొలి దాతగా బాపూజీ వక్కలగడ్డ ముందుకు వచ్చారు. ఆయన అందిస్తున్న సహకారాన్ని గుర్తిస్తూ ఆర్కాన్సాస్ విభాగం నాయకులు వేదికపై ఘనంగా సత్కరించారు.

వైవిధ్యభరితమైన సేవా కార్యక్రమాల గురించి విభాగ నాయకులు అరవింద్ శివసుబ్రమణియన్, కీర్తి దీనదయాళన్, శక్తివేల్ బాలచంద్రన్, సాయి పూర్ణిమ తదితరులు ప్రసంగించారు. శంకర నేత్రాలయ యూఎస్ఏ అధ్యక్షుడు, 'శంకరరత్న' పురస్కార గ్రహీత బాల్‌రెడ్డి ఇందూర్తి నాయకత్వానికి, ఆయన అందిస్తున్న నిరంతర సహకారానికి ఆర్కాన్సాస్ విభాగం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అమెరికా వ్యాప్తంగా సేవల విస్తరణలో, సంచార కంటి వైద్య వాహనాల నిర్వహణలో ఆయన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమ సమన్వయం, నిర్వహణలో సహకరించిన మూర్తి రేకపల్లి, డాక్టర్ రెడ్డి ఉరిమిండి, శ్యామ్ అప్పాలి, వంశీకృష్ణ ఎరువరం, రత్నకుమార్ కవుటూరు, గోవర్ధన్ రావు నిడిగంటి, కార్తికేయన్, దీనదయాలన్‌లకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ద నైబర్‌హుడ్ చర్చి యాజమాన్యానికి, వేడుకను విజయవంతం చేసిన సతీష్ శ్రీనివాసన్, పాల్ వినోద్ కుమార్, సంతోష్ సీతారామన్, జగన్ రామచంద్రన్, రాజ్ యెర్రగొల్ల, చంద్రశేఖర్.పి, గణపతి రాజమణి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు సువర్ణరేఖ బాబు, అక్షర లక్ష్మి, తన్వి మహేష్‌కుమార్, ఆదిత్య నవీన్‌కుమార్, సరయు, రియా కీర్తి, సాధ్వి వైద్యనాథన్, నివిన్ పాల్ వినోద్‌కుమార్ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. కంటి చూపు కోల్పోయిన పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శంకర నేత్రాలయ యూఎస్ఏ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు దాతలు, సేవాభిమానులు మరింతగా సహకరించాలని నిర్వాహకులు కోరారు.







## 'ప్రవాసాంధ్ర భరోసా బీమా'పై విద్యార్థులకు అవగాహన




**యూకే:** విదేశాల్లో విద్యనభ్యసిస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యార్థుల కోసం ఏపీఎన్ఆర్‌టీఎస్ ద్వారా అందిస్తున్న ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకంపై ఏపీఎన్ఆర్‌టీ యూకే కో–ఆర్డినేటర్ లింగా రవితేజ తొలి విడత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బీమా పథకం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు ఏపీఎన్ఆర్‌టీఎస్‌లో పేరు నమోదు చేసుకుని అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యాభ్యాసం కోసం లండన్‌కు వచ్చే ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఏపీఎన్ఆర్‌టీఎస్ అండగా ఉంటుందని రవితేజ భరోసా ఇచ్చారు.



## హిందూ ఆలయంలో కాల్పులకు యత్నం

**19 ఏళ్ల యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**ఇల్లినాయిస్:** అమెరికాలోని ఇల్లినాయిస్ రాష్ట్రం పాలటైన్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల అలెగ్జాండ్రోస్ పపోరాకిస్ స్థానిక ఫాస్ట్‌ఫుడ్ రెస్టారెంట్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. తీవ్రవాద భావజాలానికి ఆకర్షితుడైన అతడు ఈ నెల 11వ తేదీ ఆదివారం అరోరా శివారు ప్రాంతంలోని హిందూ ఆలయానికి వెళ్లాడు. భక్తులతో కిక్కిరిసి వున్న సమయంలో విచ్చలవిడిగా కాల్పులకు యత్నించాడు. అయితే రైఫిల్ జామ్ అవడంతో ఎవరికీ కన్పించడకుండా అలెగ్జాండ్రోస్ అక్కడి నుంచి జారుకున్నాడు. అతడు తన సహోద్యోగికి పంపిన సందేశాల్లో ఆలయంపై దాడికి ప్రయత్నించినట్టు చెప్పడంతో పాటు టాక్టికల్ వెస్ట్ ధరించిన ఫొటోను, తన తీవ్రవాద భావజాలాన్ని వివరించే ఎనిమిది పేజీల పత్రాన్ని పంపినట్టు పోలీసులు వెల్లడించారు. దీంతో అప్రమత్తమైన వారు పాలటైన్‌లోని తన నివాసం నుంచి బయటకు వస్తున్న సమయంలో పాపోరాకిస్‌ను అరెస్టు చేశారు. నిందితుడి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో రైఫిల్, లోడ్ చేసిన మ్యాగజైన్లు, వందల బుల్లెట్లు, టాక్టికల్ పరికరాలు, శరీర రక్షణ కవచంతో కూడిన వెస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇల్లినాయిస్‌లోని భారతీయులను లక్ష్యంగా చేసుకుని భీకర దాడి చేసేందుకు కుట్ర పన్నినట్టు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు. కాగా దాడి జరగకుండా అడ్డుకున్న దర్యాప్తు సంస్థలను చికాగోలోని భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయం అభినందించింది.

# అమెరికాలో ఏపీ విద్యార్థి భరత్ కన్నుమూత

**క్యాన్సర్‌తో నాలుగేళ్లు పోరాడి తుదిశ్వాస విడిచిన యువకుడు**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన మంత్రి నారా లోకేష్**



**యూఎస్ఏ:** ఉజ్వల భవిష్యత్తు కోసం అమెరికా వెళ్లిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యువకుడి జీవితం విషాదాంతమైంది. అమెరికాకు వెళ్లిన భరత్ పులిపాటి (28) ఐదేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. అక్కడకు వెళ్లిన ఏడాదికే 'హెపటో సెల్యులార్ కార్సినోమా' (కాలేయ క్యాన్సర్) బారిన పడ్డాడు. నాలుగేళ్లుగా అక్కడే చికిత్స పొందుతున్నాడు. ఇటీవల ఆరోగ్యం క్షీణించడంతో టెక్సాస్‌లోని ఆసుపత్రిలో చేరాడు. చివరి రోజుల్లో మాతృభూమికి వచ్చి కుటుంబ సభ్యుల మధ్య గడపాలని భరత్ ఆశించాడు. అనారోగ్యం దృష్ట్యా భారతదేశానికి చేరుకోవడానికి ఎయిర్ అంబులెన్స్ సహాయం కావాలని అతడు గతంలో ఒక వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశాడు. ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని అభ్యర్థించాడు. భరత్ వీడియోపై స్పందించిన ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ వెంటనే అతడి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భరత్ ఆరోగ్యం అత్యంత క్షీణదశలో ఉన్నందున ప్రయాణాలు చేయడం ప్రమాదకరమని వైద్య బృందం సూచించడంతో ప్రయాణాన్ని నిలిపివేశారు. ఈ క్రమంలోనే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ భరత్ బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచాడు. దీంతో అతడి స్వగ్రామంలోను, కుటుంబ సభ్యుల్లోను తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. భరత్ అకాల మరణం పట్ల మంత్రి నారా లోకేష్ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు!





## భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు సుప్రీంకోర్టు వరకు చేపట్టిన నిరసన ప్రదర్శనపై ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు చేసే ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని తేల్చిచెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్ణయాలను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీతోపాటు ఇండియా కూటమి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. అయితే, నోటీసులు జారీ చేసినంత మాత్రాన రాజకీయ నాయకుల ప్రవర్తనను సమర్థించినట్లు కాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### న్యాయస్థానంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు సరికాదు..

విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, న్యాయవాది గౌరవ్ భాటియా సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఇండియా కూటమి చేపట్టిన నిరసన అంశాన్ని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్.. 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. నిరసన ప్రదర్శన ద్వారా న్యాయస్థానంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారన్న వాదనపై స్పందిస్తూ.. అవన్నీ బలహీనమైన ప్రయత్నాలేనని పేర్కొన్నారు. బయట రాజకీయ నాయకులు చేసే ప్రకటనలను తాము గమనిస్తూనే ఉన్నామని, సమాజంలో జరుగుతున్న పరిణామాలు తెలియకుండా తాము లేమని వ్యాఖ్యానించారు.

### రాహుల్ గాంధీ, అఖిలేశ్‌కు నోటీసులు..

సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన చేపట్టడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌పై కూడా ధర్మాసనం విచారణ జరిపింది.

ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌తోపాటు ఇతర నేతలకు నోటీసులు జారీ చేసింది. అక్టోబరు 12న ఇండియా కూటమి చేపట్టిన నిరసన సందర్భంగా సుప్రీంకోర్టు ప్రాంగణంలో రికార్డైన సీసీటీవీ దృశ్యాలను భద్రపరచాలని ఆదేశించింది. కాగా, సోమవారం రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నాయకులు ఢిల్లీలోని బారాఖంబా రోడ్ నుంచి సుప్రీంకోర్టు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనడంతో సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారీగా జనం గుమిగూడారు.

### ఎన్నికల సంఘం నిర్ణయాలపై ఇండియా కూటమి పిటిషన్..

ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాల్ చేస్తూ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సౌగత రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎన్సీపీ (ఎస్పీ) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం నేత మహువా మాఝీ, సీపీఎం నేత ఎం.ఏ.బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ పిటిషన్ దాఖలు చేశారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన అన్ని రికార్డులను సమర్పించేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. ఎస్ఐఆర్ నిర్ణయాల రాజ్యాంగబద్ధతను పరిశీలించాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తమ అభ్యంతరాలను పరిష్కరించడంతోపాటు స్వతంత్ర కమిటీతో ఆడిట్ నిర్వహించాలని కోరారు. మొత్తం పది ప్రధాన డిమాండ్లను పిటిషన్‌లో ప్రస్తావించారు.

# జంతర్ మంతర్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



### కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు

జంతర్ మంతర్‌ను నిరసన ప్రదర్శనలకు కేటాయించిన ప్రాంతాల జాబితా నుంచి తొలగించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. వారి సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే చట్ట ప్రకారం తదుపరి చర్యలు ఉంటాయని ధర్మాసనం స్పష్టం చేసింది. జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా తొలగిస్తూ ఢిల్లీ పోలీసులు తీసుకున్న నిర్ణయాన్ని పిటిషనర్లు సవాలు చేశారు. ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాలను కేటాయించడం వల్ల ప్రజలు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేయడం కష్టమవుతుందని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు విఘాతం కలుగుతుందని వాదించారు. అయితే, విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా తొలగించే నిర్ణయానికి ముందు ఒక కమిటీని ఏర్పాటు చేసి, దాని పరిశీలన అనంతరమే నిర్ణయం తీసుకున్నట్లు కోర్టుకు తెలిపారు. దీనిపై స్పందించిన సుప్రీంకోర్టు.. ఈ అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం, ఢిల్లీ పోలీసులు సమర్పించే సమాధానాలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. కాగా, జంతర్ మంతర్‌ను నిరసన స్థలంగా తొలగించిన నిర్ణయంపై కేంద్రం, ఢిల్లీ పోలీసులు ఇచ్చే సమాధానాలు ఈ కేసులో కీలకంగా మారనున్నాయి. ఆ సమాధానాలను పరిశీలించిన తర్వాతే తదుపరి న్యాయపరమైన చర్యలపై స్పష్టత రానుంది.



# సిక్కిం గవర్నర్ నియామకంపై నిరసన

ఉత్తరాఖండ్‌లో హత్యకు గురైన యువతి అంకిత భండారీకి న్యాయ కోసం నిరసన దీక్ష చేపట్టిన ఆమె తల్లిదండ్రులను గురువారం పోలీసులు విడుదల చేశారు. ఇండియా గేట్ వద్ద వారు బుధవారం నిరసనకు దిగారు. ఓ రిసార్ట్‌లో రిసెప్షనిస్టుగా చేసిన 19 ఏళ్ల అంకిత భండారీని హత్య చేశారు. ఆరు రోజుల తరువాత స్థానికంగా ఉన్న ఓ నాలాలో ఆమె మృతదేహం లభించింది. ఈ కేసుతో బీజేపీ నేత, సిక్కిం గవర్నర్‌గా నియమితులైన దుష్యంత్ కుమార్ గౌతమ్‌కు కూడా సంబంధం ఉందని యువతి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆయన పాత్ర ఏంటో తేల్చేందుకు సీబీఐ దర్యాప్తు జరుగుతుండగానే గౌతమ్‌ను నియమించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున 3.45 గంటల సమయంలో అంకిత భండారీ తల్లిదండ్రులను పోలీసులు అదుపులోకి తీసుకుని ఆ తరువాత రెండు గంటలకు విడిచిపెట్టారు. బుధవారం నిరసనకు దిగిన అంకిత తండ్రి వీరేంద్ర భండానీ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. తమ కూతురి హత్య కేసులో సీబీఐ దర్యాప్తు పూర్తయ్యే వరకూ గవర్నర్‌గా గౌతమ్ నియామకాన్ని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. నిరసన చేపట్టిన అంకిత తల్లిదండ్రులకు కాంగ్రెస్ నేతలు, ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మద్దతు తెలిపారు. గవర్నర్ నియామకాన్ని తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు పవన్ ఖేరా, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హీ వంటి నేతలు కూడా వారికి అండగా నిలిచారు.



# డ్రోన్‌తో పాక్ ఆయుధాల తరలింపు

### రాజస్థాన్‌లో స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు : ఇద్దరి అరెస్టు

భారత్, పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో పాక్ నుంచి డ్రోన్ ద్వారా తరలించిన ఆయుధాలు, పేలుడు పదార్థాలను రాజస్థాన్ భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. శ్రీగంగానగర్ జిల్లా రావ్లా ప్రాంతంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన తనిఖీల్లో సుమారు 7.75 కిలోల పేలుడు పదార్థాలు, రెండు పిస్టళ్లు, వందల సంఖ్యలో తూటాలు లభించాయి. ఈ ఘటనకు సంబంధించి పంజాబ్‌కు చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి పాకిస్థాన్‌కు చెందిన పలువురితో సంబంధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. పండుగల సమయంలో లేదా పంజాబ్ ఎన్నికలకు ముందు ఉగ్రదాడికి పాల్పడే ఉద్దేశంతో వీటిని తరలించి ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. అధికారుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 12 అర్ధరాత్రి సరిహద్దు అవతలి వైపు నుంచి డ్రోన్ ద్వారా అనుమానాస్పద ప్యాకెట్లను జారవిడిచినట్లు భద్రతా సంస్థలకు సమాచారం అందింది. దీంతో రాజస్థాన్ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్, సరిహద్దు భద్రతా దళం, స్థానిక పోలీసులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. తొలుత ఆ ప్యాకెట్లలో మాదకద్రవ్యాలు ఉన్నాయని భావించినప్పటికీ, ఆయుధాలు, పేలుడు పదార్థాలు బయటపడ్డాయి. వాటిల్లో రెండు పిస్టళ్లు, నాలుగు మ్యాగజైన్లు, సుమారు 600 నుంచి 650 తూటాలు, రిమోట్ కంట్రోల్ పరికరాలు, బ్యాటరీలు ఉన్నట్లు సమాచారం. వీటిలో ఆర్‌డీఎక్స్ లేదా ఇతర శక్తిమంతమైన పేలుడు పదార్థాలు ఉన్నాయనే అనుమానంతో అధికారులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం జైపూర్ నుంచి బాంబు నిర్వీర్య బృందాలను రంగంలోకి దింపారు. పట్టుబడిన ఇద్దరు నిందితులు డ్రోన్ ద్వారా జారవిడిచిన ఆయుధాలను సేకరించేందుకు వచ్చారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ఈ సరకు ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరికి చేరవేయాల్సి ఉంది, దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే అంశాలపై ఆరా తీస్తున్నారు. అయితే, ఈ ఘటన వెనుక ఉగ్రదాడి కుట్ర ఉందా లేదా అన్నది ఇంకా నిర్ధారణ కాలేదు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా అక్రమంగా మాదకద్రవ్యాలు, ఆయుధాలు తరలించే ప్రయత్నాలు భద్రతా సంస్థలకు సవాలుగా మారుతున్నాయి.

# నేను సలహా ఇచ్చా.. గూగుల్ పాటించింది!

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి సన్నాయి నొక్కులు




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చాలని తాను స్వయంగా గూగుల్ మ్యాప్స్‌కు ఫోన్ చేసి కోరినట్లు వెల్లడించారు. తాను చెప్పినందుకే గూగుల్ ఆ మార్పు చేసిందని, తన పట్ల గౌరవంతోనే కంపెనీ తన మాట విందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలోని అరిజోనా రాష్ట్రంలో బుధవారం జరిగిన ఓ సభలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రభుత్వం అధికారిక భౌగోళిక పేర్ల డేటాబేస్‌లో గల్ఫ్ ఆఫ్ మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మార్చిన తర్వాత, తమ విధానం ప్రకారం గూగుల్ మ్యాప్స్‌లోనూ మార్పు చేసినట్లు గూగుల్ తెలిపింది. 2025 జనవరి 20న ట్రంప్ రెండోసారి అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రోజునే భౌగోళిక పేర్లను మార్చడానికి సంబంధించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అనంతరం అమెరికా అంతర్గత వ్యవహారాల శాఖ, భౌగోళిక పేర్ల బోర్డు, అమెరికా భూగర్భ సర్వే విభాగం ఈ మార్పును అధికారికంగా అమలు చేశాయి. కాగా, ఈ పేరు మార్పు ప్రపంచవ్యాప్తంగా ఒకే విధంగా అమలు కాలేదు. అమెరికాలోని గూగుల్ మ్యాప్స్ వినియోగదారులకు గల్ఫ్ ఆఫ్ అమెరికా అనే పేరు కనిపిస్తుంది. మెక్సికోలో మాత్రం గల్ఫ్ ఆఫ్ మెక్సికో అనే పేరునే చూపిస్తారు. భారత్ సహా ఇతర దేశాల్లోని వినియోగదారులకు సాధారణంగా రెండు పేర్లూ కనిపిస్తాయి. గూగుల్ తన మ్యాప్స్‌లో ప్రాంతాల పేర్లను చూపించే విధానాన్ని వినియోగదారుడి ప్రాంతాన్ని బట్టి నిర్ణయిస్తుంది. ఈ విధానాన్ని గతంలోనూ వివాదాస్పద భౌగోళిక పేర్ల విషయంలో అనుసరించినట్లు సంస్థ వివరించింది.

# అమెరికాలో ఘోర విమాన ప్రమాదం

## ఓ చిన్నారి సహా ఆరుగురు మృతి



అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలో మంగళవారం ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం కూలిపోవడంతో ఓ చిన్నారి సహా ఆరుగురు మృతి చెందారు. ఈ ఘటన విస్కాన్సిన్ డెల్స్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. సాక్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ అధికారుల ప్రకారం.. మంగళవారం రాత్రి ఆరు సీట్లు, ఒకే ఇంజిన్ కలిగిన చిన్న విమానం కెనోషా నుంచి మెనోమోనీకి బయలుదేరింది. అయితే, స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 9:30 గంటల సమయంలో డెల్లోనా పట్టణానికి చెందిన అటవీ ప్రాంతంలో కూలిపోయింది. ఈ ప్రాంతం విస్కాన్సిన్ డెల్స్‌కు సుమారు 10 మైళ్ల దూరంలో ఉంది. ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తమై ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, విమానంలో ఉన్న ఆరుగురూ అక్కడికక్కడే మృతిచెందగా.. ప్రజలెవరూ గాయపడలేదని అధికారులు పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులే ప్రమాదానికి కారణంగా అధికారులు భావిస్తున్నారు. ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్, నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ దర్యాప్తు చేస్తున్నాయి. పూర్తి వివరాలు ఆయా సంస్థల అధికారుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం



## ఓ టీచర్ సహా 21 మంది విద్యార్థులు మృతి : 30 మందికి గాయాలు

పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వాయవ్య పాకిస్థాన్‌లోని పెషావర్ నగరంలో ఒక ప్రైవేటు పాఠశాల పైకప్పు కూలిపోవడంతో 21 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయురాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో 30 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. గురువారం తరగతులు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది.

పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా ప్రావిన్స్ రాజధాని పెషావర్‌లోని దిర్ కాలనీలో ఈ ప్రమాదం జరిగింది. అల్ ఖైర్ పాఠశాల భవనంలోని పైకప్పు కూలిపోవడంతో తరగతి గదుల్లో ఉన్న చిన్నారులు శిథిలాల కింద చిక్కుకున్నారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అత్యవసర సేవల సిబ్బంది, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు సైతం సహాయక చర్యల్లో పాల్గొన్నారు. గాయపడిన చిన్నారులను అంబులెన్సుల్లో ఆసుపత్రులకు తరలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయురాలితో కలిపి కనీసం 21 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం వెలువడింది. మృతుల సంఖ్య మరింత పెరగొచ్చని తెలుస్తోంది. మృతులంతా చిన్న వయసు పిల్లలే కావడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనం నిర్మాణం బలహీనంగా ఉండటమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని పెషావర్ పోలీసు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు.

# హూతీలపై దాడులతో సౌదీ అరేబియా ఉక్కిరిబిక్కిరి





హూతీలపై దాడులతో ప్రస్తుతం సౌదీ అరేబియా ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దాడులను ఎలా నిలువరించాలో తెలియక సతమతం అవుతోంది. సౌదీతో దౌత్యబంధాలను బలోపేతం చేసుకునేందుకు ఉత్సుకతతో ఉన్న ఇజ్రాయెల్ హూతీలపై దాడులకు రెడీగా ఉంది. కానీ సౌదీ నుంచి మాత్రం ఇంకా గ్రీన్ సిగ్నల్ రాలేదని ఇజ్రాయెల్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇజ్రాయెల్‌ను సౌదీ ఇప్పటికీ ప్రత్యేక దేశంగా గుర్తించలేదు. దీంతో, సౌదీతో స్నేహ బంధాన్ని బలోపేతం చేసుకునేందుకు ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే యుద్ధాల్లో బిజీగా ఉన్న ఇజ్రాయెల్ దళాలను సౌదీ తరఫున రంగంలోకి దింపేందుకు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సిద్ధంగా ఉన్నారు. హూతీల విషయంలో నిఘా సమాచారం పంచుకునేందుకు ఇజ్రాయెల్ ఇప్పటికే సిద్ధమైంది. అమెరికా చొరవతో ఇరు దేశాల అధికారులు సమావేశం కూడా నిర్వహించారు. హూతీల దాడులు పెరిగిన నేపథ్యంలో సౌదీకి అండగా సేనలను పంపాలని ఇజ్రాయెల్ భావిస్తోంది. అయితే, ఇజ్రాయెల్ సాయం తీసుకునేందుకు సౌదీ యువరాజు, ప్రధాని మొహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబీఎస్) సందేహిస్తున్నారు. ఇజ్రాయెల్ సేనలను దించితే తమ దేశ ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావచ్చని భావిస్తున్నారు. హూతీలతో ఘర్షణలు మాత్రం అంతకంతకూ పెరుగుతున్నాయి. నౌకాయానానికి కీలకమైన బాబ్ ఎల్ మాండెబ్ జలసంధిపై ఇప్పటికే వారు పట్టుసాధించారు. అంతేకాకుండా, సౌదీ భూభాగంపై డ్రోన్, మిసైల్ దాడులను తీవ్రతరం చేశారు. ఈ నేపథ్యంలో సౌదీ, ఇజ్రాయెల్‌లు తమ ఉమ్మడి శత్రువుపై కలిసికట్టుగా పోరాడాలని ట్రంప్ సర్కారు కూడా భావిస్తోంది.

# పీవోకేలో పాకిస్థాన్ దుశ్చర్యలపై నివేదిక ఇవ్వండి

## ఐక్యరాజ్యసమితిని కోరిన భారత్



పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనపై భారత్ మరోసారి అంతర్జాతీయ వేదికపై ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడ జరిగిన మరణాలపై విచారణ, ఇంటర్నెట్ ఆంక్షల తొలగింపు, నిర్బంధించిన నాయకులకు న్యాయపరమైన హక్కులు కల్పించడం వంటి అంశాలపై పాకిస్థాన్ తీసుకున్న చర్యలను తెలియజేస్తూ నివేదిక విడుదల చేయాలని ఐక్యరాజ్యసమితి (ఐరాస) మానవ హక్కుల విభాగాన్ని భారత్ కోరింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మూడో కమిటీ 81వ సమావేశంలో భాగంగా బుధవారం జరిగిన చర్చలో భారత శాశ్వత మిషన్ ప్రథమ కార్యదర్శి అనుజ్ స్వరూప్ ఈ అంశాలను ప్రస్తావించారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల హైకమిషనర్ కార్యాలయం గతంలో వ్యక్తం చేసిన ఆందోళనలను ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఆందోళనల సమయంలో జరిగిన మరణాలపై నిష్పాక్షికంగా, సమగ్రంగా విచారణ జరపాలని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగం గతంలో పిలుపునిచ్చింది. భద్రతా బలగాల చర్యల్లో మరణాలు సంభవించినట్లు వచ్చిన నివేదికలపై పారదర్శక దర్యాప్తు అవసరమని ఐరాస సూచించింది. అలాగే నిర్బంధంలో ఉన్న జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ నాయకులకు న్యాయవాదులను, కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కల్పించాలని, చట్ట ప్రకారం న్యాయమైన విచారణ జరగాలని కోరింది. ఈ అంశాలపై పాకిస్థాన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల గురించి ఐక్యరాజ్యసమితి ఎప్పుడు నివేదిక ఇస్తుందని అనుజ్ స్వరూప్ ప్రశ్నించారు. మానవ హక్కుల అంశాలపై ఐరాస హైకమిషనర్ కార్యాలయం వ్యవహరిస్తున్న తీరుపై భారత్ అసంతృప్తి వ్యక్తం చేసింది. హింసాత్మక చర్యలపై తగిన స్థాయిలో స్పందించకపోవడం వల్ల అంతర్జాతీయ సంస్థలపై విశ్వాసం తగ్గుతుందని అనుజ్ స్వరూప్ వ్యాఖ్యానించారు. మానవ హక్కుల అంశాల్లో ఎంపిక చేసుకుని స్పందించే ధోరణి కాకుండా, అన్ని సందర్భాల్లో ఒకే విధమైన ప్రమాణాలను పాటించాలని భారత్ కోరింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల విభాగంతో పూర్తిగా కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు.

# 25ఏళ్లుగా నీ అసిస్టెంట్‌నే కదా: యువరాజ్ సింగ్



భారత క్రికెట్ జట్టుకు ఆటగాళ్లుగా అద్భుతమైన విజయాలు అందించిన మాజీ దిగ్గజాలు సౌరభ్ గంగూలీ, యువరాజ్ సింగ్ మళ్లీ కలిసి పనిచేసేందుకు సిద్ధమయ్యారు. అయితే ఈసారి ఆటగాళ్లుగా కాకుండా కోచ్‌లుగా సేవలు అందించనున్నారు. వచ్చే ఐపీఎల్ సీజన్ కోసం ఢిల్లీ క్యాపిటల్స్ తమ కోచింగ్ స్టాఫ్‌లో కీలక మార్పులు చేపట్టింది. ఇప్పటికే ఆ జట్టు ప్రధాన కోచ్‌గా సౌరభ్ గంగూలీ బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా... యువరాజ్ సింగ్‌ను ఢిల్లీ జట్టు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా నియమించారు. తన రీ-ఎంట్రీ సందర్భంగా గంగూలీ, యువీ మధ్య జరిగిన ఆసక్తికర సంభాషణ అభిమానులను ఆకట్టుకుంటోంది.

**గంగూలీ: "నువ్వు నా అసిస్టెంట్ అవుతావా?"**

యువరాజ్: (నవ్వుతూ) "నేను గత 25 ఏళ్లుగా నీకు అసిస్టెంట్‌నే కదా.. ఇప్పుడు కూడా నా పని అదే!"

శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ వంటి యువ క్రికెటర్లకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న యువరాజ్, ఐపీఎల్ ఫ్రాంచైజీ కోచింగ్ సెటప్‌లోకి అడుగుపెట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. 'ఈ బాధ్యతల కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. కెరీర్‌లో నన్ను ప్రోత్సహించిన గంగూలీని గురువుగా, పెద్దన్నలా భావిస్తాను. డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లందరినీ కలుపుకొని వెళ్లడం, గెలుపు సంస్కృతిని అలవర్చడంలో గంగూలీ శైలి వేరు. ఆయనతో కలిసి పనిచేయడం ఎంతో సంతోషంగా ఉంది' అని యువీ వ్యాఖ్యానించారు.

# లింక్డ్‌ఇన్‌లో విరాట్ కోహ్లీ తొలి పోస్ట్

### మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల అభినందన



భారత క్రికెట్ రంగంలో రన్ మెషిన్‌గా రికార్డులు సృష్టించిన స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ... తాజాగా ప్రపంచ ప్రఖ్యాత ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్ వేదిక 'లింక్డ్ఇన్'లోకి అడుగుపెట్టారు. ఈ బిజినెస్ ప్లాట్‌ఫామ్‌లో కోహ్లీ తన తొలి పోస్ట్ షేర్ చేయగా... మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రత్యేకంగా స్పందించి స్వాగతం పలికారు. "ఇప్పుడు నా ఫీడ్ మరింత ఆసక్తికరంగా మారింది. విరాట్.. లింక్డ్ఇన్‌లోకి నీకు స్వాగతం. 'వన్8 వరల్డ్'తో కొత్త వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న నీకు నా శుభాకాంక్షలు" అంటూ నాదెళ్ల తన పోస్ట్ ద్వారా అభినందించారు.

**కోహ్లీ తొలి పోస్ట్‌లోని ముఖ్యాంశాలు:**

భారత్‌లో ప్రతి క్రీడనూ ఆదరించి, ఆస్వాదించే రోజులు త్వరలోనే రానున్నాయని, ఇప్పుడు ఆ రోజులకు మరింత చేరువవుతున్నామని కోహ్లీ పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై రాణించేలా ప్రపంచ స్థాయి క్రీడాకారులను తీర్చిదిద్దడంతో పాటు నూతన బ్రాండ్‌లను సృష్టించే సత్తా నేటి భారతీయ యువతకు ఉందని నిరూపితమవుతోందని తెలిపారు. ఇకపై కేవలం అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొనడమే కాకుండా ప్రపంచ వేదికలపై క్రీడా భవిష్యత్తును భారత్ తీర్చిదిద్దగలదనే దృఢ విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. సరిహద్దులను చెరిపేసి, అత్యున్నత ప్రమాణాలతో సరికొత్త ప్రయత్నాలకు సాహసించినప్పుడే అసలైన వృద్ధి సాధ్యమని తన కెరీర్ అనుభవాల ద్వారా నేర్చుకున్నట్టు కోహ్లీ తన ప్రోగ్రామ్‌లో రాసుకొచ్చారు.

# అభిషేక్ శర్మ సంచలనం

### సూర్యకుమార్ యాదవ్ రికార్డు బ్రేక్



భారత యువ ఓపెనర్ అభిషేక్ శర్మ మరోసారి తన విధ్వంసకర బ్యాటింగ్‌తో చరిత్ర సృష్టించాడు. టీ-20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్‌గా నిలిచాడు. వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ-20 మ్యాచ్‌లో అభిషేక్ ఈ ఘనత సాధించాడు. దీంతో గతంలో సూర్యకుమార్ యాదవ్ పేరిట ఉన్న రికార్డును అధిగమించాడు. 2022లో సూర్యకుమార్ యాదవ్ టీ-20 అంతర్జాతీయ క్రికెట్‌లో ఒక క్యాలెండర్ ఏడాదిలో 68 సిక్సర్లు బాదాడు. ఇప్పటివరకు ఈ ప్రపంచ రికార్డు సూర్యకుమార్ పేరిట ఉండేది. అయితే 2026లో అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్న అభిషేక్ శర్మ తాజాగా ఈ రికార్డును బద్దలుకొట్టాడు. వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో తన 69వ సిక్సర్‌ను బాది ఈ రికార్డును బ్రేక్ చేశాడు. ఒక ఏడాదిలో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా అభిషేక్ నిలిచాడు. అంతర్జాతీయ టీ-20ల్లో అరంగేట్రం చేసినప్పటి నుంచి అభిషేక్ శర్మ తన దూకుడైన ఆటతీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ముఖ్యంగా పవర్‌ప్లేలో బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ జట్టు స్కోరును పరుగులు పెట్టిస్తున్నాడు. స్పిన్నర్లు, పేసర్లు అనే తేడా లేకుండా అవకాశం దొరికినప్పుడల్లా భారీ షాట్లు ఆడటం అతడి ప్రత్యేకత. 2026లో వరుసగా రికార్డులు సాధిస్తున్న అభిషేక్ భారత జట్టు బ్యాటింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు.

# ఈ కాంబినేషన్‌తో వరల్డ్ కప్ గెలవడం అసాధ్యం

### టీమిండియా బౌలింగ్‌పై మహమ్మద్ కైఫ్ తీవ్ర అసంతృప్తి

వెస్టిండీస్‌తో జరిగిన నాలుగో టీ20లో భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో భారత జట్టు విఫలమైంది. ముఖ్యంగా బౌలింగ్‌లో ధారాళంగా పరుగులు సమర్పించుకోవడం టీమిండియా ఓటమికి ప్రధాన కారణమైంది. ఈ ప్రదర్శనపై భారత మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుత బౌలింగ్ కాంబినేషన్‌తో రాబోయే ప్రపంచ కప్‌ను గెలవడం అత్యంత కష్టమని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో భారత బౌలర్లు ఏకంగా 247 పరుగులు సమర్పించుకోవడాన్ని కైఫ్ విమర్శించారు. "హైదరాబాద్ మ్యాచ్‌లో భారత్ ఎందుకు ఓడిపోయింది? కేవలం బౌలింగ్ బలహీనత వల్లే! ప్రత్యర్థికి 247 పరుగులు ఇవ్వడమంటే చిన్న విషయం కాదు. టీమిండియా బౌలర్లు ఇలా భారీగా పరుగులు ఇవ్వడం ఇదే తొలిసారి కాదు. అంతకుముందు కూడా 250 ప్లస్ టార్గెట్‌ను కాపాడుకోవడంలో విఫలమయ్యారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మూడింటిని బ్యాటర్లు గెలిపిస్తే.. కనీసం రెండింటినైనా బౌలర్లు గెలిపించాలి. కానీ మన బౌలర్లు ఆ పని చేయలేకపోయారు. ఇలాంటి కాంబినేషన్‌తో వరల్డ్ కప్ నెగ్గడం అసాధ్యం" అని కైఫ్ వ్యాఖ్యానించారు.

ఈ సందర్భంగా 2024 టీ20 ప్రపంచ కప్ విజయాన్ని కైఫ్ గుర్తు చేశారు. '2024 టీ20 ప్రపంచ కప్‌ను ఒకసారి గుర్తుచేసుకోండి. ఆ విజయంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ వంటి బౌలర్లతో పాటు బ్యాటర్లూ అద్భుతంగా రాణించారు. 'నాలుగో మ్యాచ్‌లో అభిషేక్ శర్మ నెమ్మదిగా ఆడాడని కొందరు అంటున్నారు. అయితే ప్రతి బ్యాటరూ అన్ని రోజులూ అద్భుతంగా ఆడటం సాధ్యం కాదని గ్రహించాలి. సంజూ శాంసన్ జట్టుకు మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ మినహా మిగతా మూడు మ్యాచ్‌ల్లోనూ భారత బౌలర్లు 200లకు పైగా పరుగులు ఇచ్చారు. రెండో మ్యాచ్‌లోనైతే 250 పరుగుల భారీ టార్గెట్‌ను కూడా కాపాడుకోలేకపోయారు' అని కైఫ్ ఆవేదన వ్యక్తం చేశారు.





## ప్రపంచ రికార్డుకు చేరువలో స్మృతి మంధాన

టీమిండియా మహిళా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన కెప్టెన్‌గా ఇటీవల ఎంపికైన సంగతి తెలిసిందే. మాజీ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ ఆ పదవి నుంచి తొలగినట్టు ప్రకటించడంతో కొత్త సారథిగా స్మృతి ఎంపికైంది. ఇక కెప్టెన్‌గా మంధాన తొలి అగ్నిపరీక్ష ఎదుర్కోనుంది. రేపటి నుంచి భారత్, జింబాబ్వే మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ జరగనుంది. పూర్తిస్థాయి కెప్టెన్‌గా మంధానకు ఇదే తొలి టీ20 సిరీస్ కానుంది. ఈ నేపథ్యంలో కెప్టెన్‌గా తన తొలి మ్యాచ్‌లోనే భారత్‌ను గెలిపించాలనే పట్టుదలతో ఉంది.

కెప్టెన్ కమ్ బ్యాటర్‌గా ఉన్న స్మృతి మంధాన ముందు ఒక ప్రపంచ రికార్డు ఉంది. ఈ స్టార్ బ్యాటర్ మరో 133 పరుగులు సాధిస్తే అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో 5వేల పరుగులు పూర్తవుతాయి. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి మహిళా బ్యాటర్‌గా మంధాన చరిత్ర సృష్టించనుంది. ఇప్పటివరకు మంధాన 179 మ్యాచ్‌ల్లో 127.5 స్ట్రైక్‌రేట్‌తో 4,867 పరుగులు చేసింది. ఆమె ఖాతాలో రెండు సెంచరీలు, 37 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో మంధాన తర్వాత అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్ల జాబితాలో న్యూజిలాండ్ బ్యాటర్ సుజీ బేట్స్ (4,758 పరుగులు) రెండో స్థానంలో ఉండగా, మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (4,327 పరుగులు), శ్రీలంక కెప్టెన్ చమేరి ఆటపట్టు (4,282 పరుగులు) మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు. మరోవైపు భారత్, జింబాబ్వే మధ్య మూడు టీ20 మ్యాచ్‌లు ఈ నెల 16, 18, 20 తేదీల్లో జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లకు రాయ్‌పూర్ ఆతిథ్యమివ్వనుంది.

## సన్‌రైజర్స్‌లోకి నటరాజన్ రీ ఎంట్రీ



ఐపీఎల్ ట్రేడింగ్ నిబంధనల్లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) జట్టు తమ మాజీ పేసర్ టి.నటరాజన్‌ను తిరిగి సొంతం చేసుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ నుంచి ట్రేడ్ ద్వారా నటరాజన్‌ను సన్‌రైజర్స్ దక్కించుకోగా.. అతనికి రూ.5 కోట్లు చెల్లించనున్నారు. 2025 ఐపీఎల్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నటరాజన్‌ను రూ.10.75 కోట్లకు కొనుగోలు చేసింది. అంతకు ముందు 2020 నుంచి 2024 వరకు ఐదు సీజన్ల పాటు ఆయన సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫునే ఆడాడు. ముఖ్యంగా 2024 సీజన్‌లో 19 వికెట్లు పడగొట్టి ఎస్ఆర్‌హెచ్ జట్టు ఫైనల్ చేరడంలో నటరాజన్ కీలక పాత్ర పోషించారు. మరోవైపు 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున ఆడిన లెగ్ స్పిన్నర్ జీషన్ అన్సారీని ఢిల్లీ క్యాపిటల్స్ ట్రేడ్ ద్వారా తీసుకుంది. జీషన్‌కు ఆయన ప్రస్తుత ఫీజు అయిన రూ.40 లక్షలనే ఢిల్లీ కూడా చెల్లించనుంది.

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 16 అక్టోబరు 2026 X

# జయమ్మ పాత్ర ప్రేరణతో 400 కుటుంబాలకు 'రష్మిక' అండ

సేవా కార్యక్రమాలతో తన గొప్ప మనసు చాటుకుంటున్నారు హీరోయిన్ రష్మిక మందన్న. తన కొత్త సినిమా రణబాలిలో జయమ్మ పాత్ర ప్రేరణతో ఆమె 'అన్నపూర్ణ' అనే సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఇందులో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన 400 కుటుంబాలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు.

ఈ సందర్భంగా హీరోయిన్ రష్మిక మాట్లాడుతూ... 'జయమ్మ పాత్రకు మీకు ఏవైనా పోలికలు ఉన్నాయా అని మీరు నన్ను అడుగుతుంటారు. నేను అవుననే సమాధానం ఇస్తాను. మీరు నాపై చూపించే ప్రేమకు కృతజ్ఞతగా ఇలాంటి మంచి పనులు చేస్తుంటాను కానీ ఎవరికీ చెప్పలేదు. నాకు, నా టీమ్ కు తెలిస్తే చాలు అనుకున్నాను. కానీ మిమ్మల్ని కూడా నా సేవా కార్యక్రమం ఇన్స్పైర్ చేస్తుందనేకారణంతో ఇప్పుడు చెప్తున్నాను. నేను ఈరోజు 400 కుటుంబాలను దత్తత తీసుకున్నాను. ఒకేసారి 400 కుటుంబాలకు ప్రతి 3నెలల చొప్పునసహాయం చేస్తూ ఏడాది పొడవునా దీనిని కొనసాగించాలను కుంటున్నాను. ఆ నిత్యావసర సరుకుల డబ్బును పొదుపు చేసుకుని, రాబోయో రోజులకు దాచుకుంటారని ఆశిస్తున్నాను' అన్నారు.



విజయ్ దేవరకొండ స్పందిస్తూ... 'ఇలాంటి మంచి కార్యక్రమాలను నువ్వు ఎప్పటి నుంచో చేస్తున్నావు కానీ ఎవరికీ తెలియనివ్వలేదు. ఇప్పుడు నువ్వు చేపట్టిన అన్నపూర్ణ ప్రాజెక్టు ఏడాది పాటు 400 కుటుంబాలకు అండగా నిలబడుతుంది. వాతావారణ మార్పులతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్న ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబాలను కాపాడుతుంది. నీ మంచి మనసుకు గర్వపడుతున్నాం. మనం ఎదగడమే కాదు మన వాళ్ల కోసం నిలబడదాం.' అన్నారు.

# 'డ్రాగన్' అవతారంలో ఎన్టీఆర్

## రామోజీ ఫిల్మ్ సిటీలో షూటింగ్ షురూ



అగ్ర హీరో ఎన్టీఆర్ ప్రధాన పాత్రలో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'డ్రాగన్'కు సంబంధించి కీలక షెడ్యూల్ ప్రారంభమైంది. రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో అనిల్కపూర్, బిజు మీనన్, ఖుష్బూ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తగిలిన గాయం కారణంగా ఎన్టీఆర్ షూటింగ్కు కొద్దిగా విరామం ఇచ్చారు. అయితే ఈ సినిమా చిత్రీకరణ మాత్రం ఎలాంటి అంతరాయం లేకుండా శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం గాయం నుంచి పూర్తిగా కోలుకున్న ఎన్టీఆర్ తిరిగి సెట్స్లో అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన టాకీ పార్ట్ సన్నివేశాలను రామోజీ ఫిల్మ్ సిటీలో తెరకెక్కిస్తున్నారు. ఎన్టీఆర్తో పాటు ఇతర ప్రధాన తారాగణంపై ఈ కీలక సీక్వెన్స్లను చిత్ర యూనిట్ షూట్ చేస్తోంది. మైత్రి మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఇందులో ఎన్టీఆర్ 'లూగర్' అనే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారు. అన్ని హంగులు పూర్తి చేసుకుని ఈ సినిమా వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

# పుట్టినరోజున సాయిదుర్గా తేజ్ కొత్త సినిమా ప్రకటన



టాలీవుడ్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మెగా హీరో సాయిదుర్గా తేజ్ (సాయిధరమ్ తేజ్) తన తదుపరి సినిమాతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్న ఈ యువ హీరో తన కెరీర్లో 19వ చిత్రానికి సంబంధించిన కీలక ప్రకటనతో అభిమానుల్లో ఆసక్తి పెంచారు. తన పుట్టినరోజు సందర్భంగా ఈ కొత్త ప్రాజెక్ట్ను ప్రకటించడంతో మెగా అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్టైన్మెంట్స్ ఈచిత్రాన్ని నిర్మించనుండగా... 'సేవ్ ది టైగర్స్' వెబ్ సిరీస్తో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు తేజ కనుమ దర్శకత్వం వహించనున్నారు.

# గంటన్నర పాటు కిక్ బాక్సింగ్

## పునీత్ రాజ్కుమార్ చివరి క్షణాలపై డాక్టర్ రమణారావు సంచలన విషయాలు

బెంగళూరు: కన్నడ పవర్ స్టార్ పునీత్ రాజ్కుమార్ ఐదేళ్ల క్రితం అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఆఖరి క్షణాలకు సంబంధించిన కొన్ని కీలక అంశాలను డాక్టర్ రమణారావు తాజాగా వెల్లడించారు. తీవ్రమైన వర్కౌట్ తర్వాత పునీత్ తన క్లినిక్కు వచ్చారని, ఈసీజీలో ఇబ్బంది ఉండటంతో వెంటనే ఆసుపత్రికి పంపించినట్లు ఆయన తెలిపారు.

### ఆనాడు ఏం జరిగిందంటే...

ముద్దుగా అందరూ 'అప్పూ' అని పిలుచుకునే పునీత్ రాజ్కుమార్ 2021 అక్టోబర్ 29న 46 ఏళ్ల వయసులో గుండెపోటుతో కన్నుమూశారు. ఆ రోజు జిమ్లో గంటన్నర పాటు కిక్ బాక్సింగ్ ప్రాక్టీస్ చేసిన తర్వాత ఆయన నేరుగా డాక్టర్ రమణారావు క్లినిక్కు వెళ్లారు. పునీత్ ఆ రోజు తొలిసారి కిక్ బాక్సింగ్ చేయడం వల్ల పూర్తిగా శక్తి కోల్పోయారని డాక్టర్ తెలిపారు. అప్పూ క్లినిక్కు వచ్చినప్పుడు ఆయనకు తీవ్రస్థాయిలో చెమటలు పట్టాయని, జిమ్లో గంటన్నర పాటు కిక్ బాక్సింగ్ చేసినట్లు చెప్పారని



పేర్కొన్నారు. చెమట ఎక్కువగా రావడంతో అనుమానం వచ్చి ఈసీజీ చేయగా అందులో స్ట్రెయిన్ ఉన్నట్లు గుర్తించామని డాక్టర్ రమణారావు వెల్లడించారు. వెంటనే ఆయనకు తగిన మెడిసిన్ ఇచ్చి, మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి పంపించామన్నారు.

పునీత్ తన సొంత కారులోనే ఆసుపత్రికి వెళ్లారని, దారిలో అందరితోనూ మాట్లాడారని డాక్టర్ గుర్తు చేసుకున్నారు. తనకు కూర్చోవాలని ఉన్నా తన భార్య అశ్విని ఒడిలో తలపెట్టి నిద్రపోవాలని కోరినట్లు తెలిపారు. రాజ్కుమార్ కుటుంబానికి గతంలో వైద్యం అందించిన డాక్టర్ రంగనాయక్ విక్రమ్ ఆసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశారని చెప్పారు. అయితే ఆసుపత్రికి చేరుకోవడానికి కేవలం ఒక్క నిమిషం ముందే పునీత్ గుండె ఆగిపోయిందని డాక్టర్ రమణారావు తెలిపారు. ఆసుపత్రి లోపలికి తీసుకెళ్లేసరికి ఆయనలో హార్ట్ బీట్ లేదని పేర్కొన్నారు. బెంగళూరులోని విక్రమ్ ఆసుపత్రిలో వైద్యులు సీపీఆర్ చేసినప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పునీత్తో తనకు మంచి అనుబంధం ఉండేదని, ఆయన తన రెండో కుమారుడితో కలిసి ఆడుకునేవాడని డాక్టర్ గుర్తు చేసుకున్నారు.




# 'వృషకర్మ'గా నాగచైతన్య

యువ సామ్రాట్ నాగ చైతన్య మోస్ట్ ఎవైటెడ్ మైథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్కు సిద్ధమవుతోంది. ఈ చిత్రాన్ని డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి అధికారికంగా ధృవీకరించారు. కార్తీక్ దండు దర్శకత్వంలో ఎస్విసిసి, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం మునుపెన్నడూ చూడని సినిమాటిక్ ఎక్స్పీరియన్స్ అందించబోతోంది. బాపినీడు ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సినిమా విడుదలకు 50 రోజుల కౌంట్డౌన్ను పురస్కరించుకుని మేకర్స్ సరికొత్త పోస్టర్ను విడుదల చేశారు. ఇందులో నాగచైతన్య స్టైలిష్గా, యాక్షన్ అవతార్లో కనిపిస్తున్నారు. పదునైన లోహపు అంచు ఉన్న తాడు ఆయుధాన్ని చేతబట్టి ఉన్న ఆయన చుట్టూ దుమ్ము మేఘాలు, గాల్లో ఎగురుతున్న రాళ్లు, తుఫాను వాతావరణంతో కూడిన ప్రకృతి దృశ్యాలు కనిపిస్తున్నాయి.

# 'కరికాల' నా కెరీర్ బెస్ట్ అవుతుంది

## చిత్ర ప్రారంభోత్సవంలో హీరో సందీప్ కిషన్



సందీప్ కిషన్ హీరోగా షైనింగ్ పిక్చర్స్ బ్యానర్పై మహిధర్రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మాణంలో యుగంధర్ ముని తెరకెక్కిస్తున్న చిత్రం 'కరికాల'. 'కరికాల' మొదటి చాప్టర్ను 2027 జూలై 2న, 2027 అక్టోబర్ 28న విడుదల చేస్తామని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే గురువారం నాడు ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముగ్గురు కథానాయికలు కేథరిన్ థ్రెసా, గాయత్రి భరద్వాజ్, సాక్షి మడోల్కర్ సందడి చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజశేఖర్ తల్లి సత్యవతి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, మహిధర్ తల్లి పద్మారెడ్డి క్లాప్ కొట్టారు. తొలి సన్నివేశానికి ఆది సాయికుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. నిర్మాత రాజశేఖర్ తండ్రి వీరభద్రాచారి స్క్రిప్ట్ అందజేశారు.

హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ... "కరికాల' చిత్ర ప్రారంభోత్సవంలో నేను ముందుగా నా ఫ్రెండ్ ఆదికి థాంక్స్ చెప్పాలి. ఆది 'శంబాల' వల్లే యుగంధర్, రాజశేఖర్, మహిధర్ పరిచయం అయ్యారు. కథ చెప్పడమే రెండు పార్టులుగా ఉంటుందని వివరించారు. అయితే నాకు ఒక్క నిమిషం కూడా బోర్ అనిపించలేదు. ఆరేడు నెలలుగా మా దర్శకుడు 24 గంటలు ఈ ప్రీ ప్రొడక్షన్ పనుల్లోనే బిజీగా ఉంటూ వచ్చారు. నిర్మాతలు కూడా ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటారు. ఇలాంటి దర్శక, నిర్మాతలు నాకు దొరకడం ఆనందంగా ఉంది. 'కరికాల' నా కెరీర్ బెస్ట్ అవుతుందని అనుకుంటున్నాను. శ్రీచరణ్ ఈ సినిమాకి అద్భుతమైన ఆల్బమ్ రెడీ చేస్తున్నారు. మాకెప్పుడూ సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్' అన్నారు.

# పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో విజయ్ దేవరకొండ దంపతులు

రణబాలి సినిమా విడుదల వేళ ప్రముఖ టాలీవుడ్ జంట విజయ్దేవరకొండ-రష్మిక మందన్న దంపతులు శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న వార్షిక వేదపురుష సప్తహ జ్ఞానయజ్ఞం వేడుకల్లో భాగంగా సాయి కుల్వంత్ హాల్ను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.భగవాన్ సత్యసాయి సన్నిధిలో ప్రార్ధనలుచేసి భజన మందిరాన్ని దర్శించుకున్నారు. తాను సత్యసాయి స్కూల్ విద్యార్థినని, ఇక్కడే యజ్ఞంలో వేద మంత్రాలు చదివిన రోజులు గుర్తుకు వచ్చాయని విజయ్ చెప్పారు. రష్మిక మాట్లాడుతూ... తొలిసారి పుట్టపర్తి రావడం సంతోషంగా ఉందని.. ఇక్కడి ప్రశాంతత, వేద మంత్రాలు, హారతి ఎంతో ప్రత్యేకంగా అనిపించాయన్నారు.

